పక్కా తెలుగు

PRGI REGD No.: TGTEL/26/A4986

# ప్రభాత కిరణమ్

సత్యానికి వారధి

5 DOTS NETWORK

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 019 | సోమవారం | 13-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Medchal Malkajigiri | Volume : 01 | Issue : 019 | Monday | 13-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri



# ఇండియాలో కాదు.. అమెరికాలో సర్

- ఎన్నికల వ్యవస్థపై డొనాల్డ్ నజర్
- అమెరికా ఎన్నికల వ్యవస్థపై పంజా
- ఎన్నికలకు ముందుగానే ట్రంప్ బాజా
- ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేసే ఎత్తుగడ
- చెప్పుచేతల్లోకి వ్యవస్థను తీసుకునే క్రీడ
- మాస్టర్ స్ట్రాటజీతో అగ్రరాజ్యంలో కొత్త పోరు
- ఎన్నికల వ్యూహాలతో అంటుకుంటున్న పోరు

ప్రజాస్వామ్యానికి మార్గదర్శకంగా చెప్పుకునే అమెరికాలో ఇప్పుడు ఎన్నికల వ్యవస్థే రాజకీయ పోరాటానికి కేంద్రబిందువుగా మారుతోంది. ఎన్నికలు జరగకముందే వాటి నిర్వహణ విధానం, ఓటర్ల నమోదు, ఎన్నికల సంస్థల నిర్మాణం, ఓటింగ్ నిబంధనలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం వరుస నిర్ణయాలు తీసుకుంటుండటం తీవ్ర చర్చకు దారితీసింది. ఓటర్ల జాబితాల పరిశీలన నుంచి ఎన్నికల కమిషన్ నాయకత్వంలో మార్పులు వరకు ప్రతి చర్య వెనుక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2020 ఎన్నికల అనుభవం తర్వాత ఫలితాలను మార్చే ప్రయత్నం కాకుండా, ఈసారి ఎన్నికలకు ముందే వ్యవస్థను తనకు అనుకూలంగా మలచే ఎత్తుగడ అమలవుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల భద్రత పేరుతో సాగుతున్న ఈ చర్యలు ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రతను ప్రభావితం చేస్తాయా? లేక ఎన్నికల విశ్వసనీయతను మరింత బలోపేతం చేస్తాయా? అన్న ప్రశ్నలు ఇప్పుడు అమెరికా రాజకీయాల్లోనే కాదు, ప్రపంచ ప్రజాస్వామ్య దేశాల్లోనూ ఆసక్తికర చర్చకు దారితీశాయి.

# ప్రజల పాపం తగిలింది

## అందుకే ఫామ్‌హౌజ్‌కే పరిమితం

### కేసీఆర్‌పై కోమటిరెడ్డి ఘాటు వ్యాఖ్యలు

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆలేరు, భువనగిరి ప్రజల పాపం తగలడంతోనే కేసీఆర్ కాలు విరిగి ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని వ్యాఖ్యానించారు. తెలంగాణను మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిందని ఆరోపించారు. బస్వాపూర్, గందమల్ల ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొందని విమర్శించారు. (2లో..)





## నీళ్లు అడిగితే నెత్తురా?

» జల రాజకీయాల జ్వాలలు

» కాంగ్రెస్‌పై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

» ఎక్స్ వేదికగా భావోద్వేగ విమర్శలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో రైతులకు సాగునీరు అందించాల్సిన ప్రభుత్వం రాజకీయ విమర్శలకే పరిమితమైందని ఆరోపించారు. రైతులు నీళ్లు అడిగితే నెత్తురు ఇస్తామంటారా అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రతీకారానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. ఎండిపోతున్న పంటలను కాపాడటంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. (వివరాలు 2లో..)

## నచ్చినట్లు చెప్తే మేధావులు, నిపుణులా ?

» ఉన్నది ఉన్నట్లు చెప్తే బీఆర్ఎస్ మనుషులా ?

» సీఎంవి అన్నీ అబద్ధాలే.. వాస్తవాల వక్రీకరణ

» రేవంత్ వ్యాఖ్యలకు హరీశ్‌రావు స్ట్రాంగ్ కౌంటర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ప్రాజెక్టు నిర్మించలేదని, ఒక్క ఎకరానికి కూడా నీరు అందించలేదని రేవంత్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని విమర్శించారు. వాస్తవాలను వక్రీకరించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు.







## సింగరేణి కార్మికులకు బీజేపీ భరోసా

- రేపటి నుంచి కిషన్ రెడ్డి నేతృత్వంలో యాత్ర
- రెండు రోజుల పర్యటనకు శ్రీకారం




## మారిపోనున్న సరిహద్దులు

₹14,115 కోట్ల మెగా ప్రణాళిక • ఢిల్లీ-యూపీ రూపురేఖల్లో చేంజ్

మెగా రోడ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ • ఇకపై వేగంగా ప్రయాణానికి ఛాన్స్




## స్నేహమంటే ఇదేరా

సినిమాను తలపించిన రియల్ సీన్

35 ఏళ్ల మాట నిలబెట్టుకున్న మిత్రుడు

నాటి వెయ్యి అప్పుకు నేడు ₹ 25 వేలు చెల్లింపు

మూడు దశాబ్దాల తర్వాత నిలబెట్టుకున్న వాగ్దానం

## కాళేశ్వరంపై జగ్గారెడ్డి క్లారిటీ

- ముందు క్షమాపణ చెప్పాల్సింది వాళ్లే
- సినిమా డైలాగులు బంద్ చేయండి
- కేసీఆర్, హరీశ్‌పై కాంగ్రెస్ నేత నిప్పులు




కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మరింత ఉధృతమైంది. కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడానికి బాధ్యులైన కేసీఆర్, హరీశ్‌రావు ముందుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసిన తర్వాత విమర్శలు చేయడం సరికాదన్నారు. రైతులకు నష్టం చేసిన వారే ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. (వివరాలు 2లో..)

## ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా రేవంత్ రూల్

- ఇక చాలు వద్దంటూ కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ సవాల్
- ప్రభుత్వ తీరుతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారా?
- తిరిగి బీఆర్ఎస్‌ని గెలిపించడానికి ప్రజలు డిసైడయ్యారా?
- శేరిలింగంపల్లిలో ఈసారి దూసుకుపోయేది కారు పార్టీయేనా?

గ్రేటర్‌లో గులాబీ గుబాళింపు మరోసారి ఖాయమేనా? తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, ప్రచారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మారిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. రైతు భరోసా నుంచి హైదరాబాద్ అభివృద్ధి వరకు, కాళేశ్వరం నుంచి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వరకు, హైడ్రా చర్యల నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ వరకు ప్రతి అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలనే ప్రజలు చూస్తున్నారని అన్నారు. శేరిలింగంపల్లి రాజకీయ పరిస్థితులు, ఆల్విన్ కాలనీ సమస్యలు, రాబోయే స్థానిక ఎన్నికలు, తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై తన అభిప్రాయాలను ఆయన స్పష్టంగా వెల్లడించారు. శేరిలింగంపల్లిలో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడడం ఖాయమని, రాష్ట్రవ్యాప్తంగా కూడా బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభాత కిరణమ్ మేనేజింగ్ ఎడిటర్ శ్వేత.కె తో జరిగిన ఈ ప్రత్యేక ఇంటర్వ్యూలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ఎర్రబెల్లి సతీష్ రావు సూటిగా, స్పష్టంగా తన విమర్శలను వినిపించారు.




## కాంగ్రెస్ డైరెక్షన్

**బీఆర్ఎస్ యాక్షన్ • 'రక్తకన్నీరు-2' గాథలు**

**కాళేశ్వరం రాజకీయాలు**

కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ కొనసాగుతున్న రాజకీయ విమర్శలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ఘాటు సెటైర్లు పేల్చారు. ఈ రెండు పార్టీల నాయకులు ప్రజల సమస్యలపై కాకుండా రాజకీయ నాటకాలపై ఎక్కువ దృష్టి పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ డైరెక్షన్‌లో, బీఆర్ఎస్ యాక్షన్‌తో నడుస్తున్న సినిమా పేరు "రక్తకన్నీరు 2" అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకు అభివృద్ధి చూపాల్సింది పోయి రక్తకన్నీరు సినిమా చూపిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ అసలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. (వివరాలు 2లో..)






## దేశంలో దొంగలుపడ్డారు

- జాతీయత దాచి చొరబాటు
- పాక్ మహిళ, కొడుకు అరెస్ట్
- రేషన్, ఓటర్ కార్డ్ స్వాధీనం

కర్ణాటకలో జాతీయతను దాచిపెట్టి ప్రభుత్వ పత్రాలు పొందిన కేసులో పాకిస్థాన్‌కు చెందిన ఓ మహిళ, ఆమె కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి ప్రాంతంలో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఫరా నాజ్, ఆమె కుమారుడు మహ్మద్ ఫర్దీన్‌పై భారతీయ పౌరులుగా తప్పుడు సమాచారం ఇచ్చి రేషన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారం బయటపడటంతో అధికారులు వెంటనే విచారణ ప్రారంభించారు.

## మోదీజీ హామీ నిలబెట్టుకోండి


**జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వండి**

**ప్రధానిపై సీఎం ఒమర్ అబ్దుల్లా ఒత్తిడి**

**హోదా కోసం జూలై 20న ఢిల్లీలో ధర్నా**

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీకి విలువ ఉండాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. జమ్మూలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, దేశ ప్రధానమంత్రి ఇచ్చే హామీ సాధారణ మాట కాదని, దానిని అమలు చేసే దిశగా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. కత్రాలో ప్రధాని చేసిన ప్రకటనను గుర్తుచేస్తూ, "ఇది మోదీ హామీ" అని చెప్పిన మాటలు ఇప్పుడు ఆచరణలో కనిపించాలని అన్నారు. (వివరాలు 3లో..)





## పేరెంట్స్ మస్ట్.. ఓటర్ లిస్ట్‌లో ట్విస్ట్

- కొత్త ఓటర్లకు నయా షరతు
- ఓటర్ల నమోదుకు ఈసీ నిబంధన
- తల్లిదండ్రుల సర్ వివరాలు తప్పనిసరి

దేశంలో కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారికి ఎన్నికల సంఘం కీలక మార్పు తీసుకొచ్చింది. ఇకపై కొత్త ఓటర్లు ఎన్నికల జాబితాలో పేరు నమోదు చేసుకునే సమయంలో తమ తల్లిదండ్రులకు సంబంధించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్... సర్ వివరాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఈ నిబంధన పాత ఓటర్లకే వర్తిస్తుందనే అభిప్రాయం ఉండగా, కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికీ ఇదే నిబంధన అమల్లో ఉందని ఎన్నికల సంఘం అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఓటర్ల నమోదు ప్రక్రియలో మరో కీలక మార్పు చోటుచేసుకుంది.

# కాళేశ్వరంపై జగ్గారెడ్డి క్లారిటీ

- ముందు క్షమాపణ చెప్పాల్సింది వాళ్లే
- సినిమా డైలాగులు బంద్ చేయండి
- కేసీఆర్, హరీశ్‌పై కాంగ్రెస్ నేత నిప్పులు



కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మరింత ఉధృతమైంది. కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడానికి బాధ్యులైన కేసీఆర్, హరీశ్‌రావు ముందుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసిన తర్వాత విమర్శలు చేయడం సరికాదన్నారు. రైతులకు నష్టం చేసిన వారే ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు.

**ఎన్‌డీఎస్‌ఏ సూచనలకే ప్రభుత్వం కట్టుబాటు**

ఎన్‌డీఎస్‌ఏ ఏ సూచనలు చేసినా వాటిని అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం పునరుద్ధరణ విషయంలో ప్రభుత్వం రాజకీయాలు చేయడం లేదని, నిపుణుల సలహాల మేరకే ముందుకు వెళ్తోందని చెప్పారు. రైతులకు మేలు చేసే నిర్ణయాలకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టును తిరిగి ఉపయోగంలోకి తీసుకురావడానికి అవసరమైన ప్రతి చర్య చేపడతామని తెలిపారు.

**హరీశ్‌రావుపై ఘాటు వ్యాఖ్యలు**

రక్తం చిందిస్తామని హరీశ్‌రావు చేస్తున్న వ్యాఖ్యలపై కూడా జగ్గారెడ్డి తీవ్రంగా స్పందించారు. రక్తం చిందించే ధైర్యం ఆయనకు లేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పెట్రోల్ పోసుకుని అగ్గిపెట్టె తీసుకురావడం మర్చిపోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ప్రజలను భావోద్వేగాలకు గురిచేసే ప్రకటనలు చేయడం తప్ప బీఆర్ఎస్ నేతలు ప్రజల కోసం చేసిందేమీ లేదని ఆరోపించారు. హింసను ప్రేరేపించే రాజకీయాలకు కేసీఆర్ కుటుంబమే చిరునామాగా మారిందని విమర్శించారు.

**ఈటలకు జగ్గారెడ్డి సూచన**

ప్రస్తుతం బీజేపీలో కీలక నాయకుడిగా ఉన్న ఈటల రాజేందర్‌ను కూడా జగ్గారెడ్డి ఉద్దేశించి మాట్లాడారు. గతంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన ఈటలకు కాళేశ్వరం వ్యవహారంపై పూర్తి అవగాహన ఉందన్నారు. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే కేసీఆర్, హరీశ్‌రావును ఒప్పించి కేంద్రం వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. అవసరమైతే కాంగ్రెస్ మంత్రులు కూడా వస్తారని, ఎన్‌డీఎస్‌ఏతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కేవలం విమర్శలు చేయడం కాకుండా సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు.

# ప్రజల పాపం తగిలింది

- అందుకే ఫామ్‌హౌజ్‌కే పరిమితం
- కేసీఆర్‌పై కోమటిరెడ్డి ఘాటు వ్యాఖ్య లు

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆలేరు, భువనగిరి ప్రజల పాపం తగలడంతోనే కేసీఆర్ కాలు విరిగి ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని వ్యాఖ్యానించారు. తెలంగాణను మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిందని ఆరోపించారు. బస్వాపూర్, గందమల్ల ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొందని విమర్శించారు.

**• ప్రజలకు ఇచ్చిన హామీలపై మంత్రి వ్యాఖ్యలు**

తాను ఎంపీగా పోటీ చేసినప్పుడు ఆలేరు ప్రజలు స్వచ్ఛందంగా అండగా నిలిచి గెలిపించారని కోమటిరెడ్డి గుర్తు చేసుకున్నారు. ఎంపీగా ఉన్న సమయంలో పోరాడి వంగపల్లి అండర్‌పాస్ మంజూరు చేయించానని చెప్పారు. పాల సంఘం చైర్మన్‌గా ఉన్నప్పుడు బీర్ల ఐలయ్య ఎలా ప్రజల మధ్య ఉన్నారో, ఎమ్మెల్యేగా అయిన తర్వాత కూడా అదే విధంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఆయనను మరోసారి గెలిపిస్తే మంత్రిని చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం నెరవేరుస్తోందని, కొంత ఆలస్యం జరిగినా ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తామని తెలిపారు. పదవుల కోసం నాయకులు పరస్పరం విభేదాలు సృష్టించుకోవద్దని సూచించారు. ఆలేరు, భువనగిరి ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నల్గొండలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో పాఠశాల నిర్మించామని కూడా మంత్రి వెల్లడించారు.

**• రోడ్ల అభివృద్ధికి భారీ నిధులు**



యాదాద్రి జిల్లా వంగపల్లిలో హ్యామ్ ప్యాకేజ్ 1 కింద రూ.339.59 కోట్లతో చేపట్టనున్న 109.30 కిలోమీటర్ల పొడవైన ఏడు రహదారుల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. అనంతరం రామన్నపేటలో హ్యామ్ ఫేజ్ 1 ప్యాకేజ్ 2 కింద రూ.358.18 కోట్ల వ్యయంతో 210.10 కిలోమీటర్ల పొడవైన 11 రహదారుల నిర్మాణ పనులకు కూడా శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఈ రహదారుల నిర్మాణంతో గ్రామాల మధ్య అనుసంధానం బలోపేతం అవుతుందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, సాధారణ ప్రజల ప్రయాణం మరింత సులభమవుతుందని చెప్పారు. మెరుగైన రహదారులు స్థానిక ఆర్థికాభివృద్ధికి ఊతమిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో నాణ్యమైన రహదారులు నిర్మించి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు.

# ఆ పేరు మాకే.. ఫికర్ చేయొద్దు

- మొదట ఇచ్చాక ఈ పంచాయితీ ఏంటి?
- 105 నియోజకవర్గాల్లో పార్టీ విసరణ
- ఈసీకి లేఖ రాసిన తెలంగాణ రక్షణ సేన
- గుర్తింపు కోసం ఎన్నికల సంఘానికి లేఖ



తెలంగాణ రక్షణ సేన, టీఆర్ఎస్ పార్టీకి వెంటనే అధికారిక గుర్తింపు ఇవ్వాలని పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఢిల్లీ హైకోర్టు తాజా ఆదేశాల మేరకు ఎన్నికల సంఘానికి తన లిఖితపూర్వక సమాధానాన్ని సమర్పించినట్లు వెల్లడించారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఇతర కమిషనర్లకు ప్రత్యేక లేఖ పంపారు. పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిష్పాక్షికంగా పూర్తి చేసి గుర్తింపు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**105 నియోజకవర్గాల్లో పార్టీ విస్తరణ**

ఈ ఏడాది ఏప్రిల్ 28న ఎన్నికల సంఘం తెలంగాణ రక్షణ సేన పేరును కేటాయించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు కవిత వివరించారు. ఆ నిర్ణయాన్ని విశ్వసించి తెలంగాణలోని 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేశామని తెలిపారు. పార్టీ కార్యకలాపాలు ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లాయని, ఇప్పుడు పేరు మార్చాలని సూచిస్తే తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**వెయ్యి అభ్యంతరాలపై ప్రశ్నలు**

పార్టీ రిజిస్ట్రేషన్‌పై సుమారు వెయ్యి అభ్యంతరాలు వచ్చాయని ఎన్నికల సంఘం జూన్ 23న లేఖ పంపిందని కవిత తెలిపారు. అయితే ఆ అభ్యంతరాల ప్రతులను తమకు అందించలేదని పేర్కొన్నారు. ఎవరు అభ్యంతరాలు తెలిపారు? వాటి స్వరూపం ఏమిటి? అనే వివరాలు తెలియకుండా సమాధానం ఎలా ఇవ్వగలమని ప్రశ్నించారు. మూడున్నర కోట్ల జనాభా ఉన్న తెలంగాణలో వెయ్యి అభ్యంతరాల ఆధారంగా నిర్ణయం తీసుకోవడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. కొందరు ఉద్దేశపూర్వకంగా సమూహాలుగా ఏర్పడి ఈ అభ్యంతరాలను పంపించారా అనే కోణంలో కూడా విచారణ జరపాలని కోరారు.

**హైకోర్టు ఆదేశాల అమలు కోరిన కవిత**

ఢిల్లీ హైకోర్టు సూచించిన విధంగా వ్యక్తిగత విచారణకు ముందే అన్ని అభ్యంతరాల కాపీలు, తమకు వ్యతిరేకంగా ఉన్న ఆధారాలను అందించాలని ఎన్నికల సంఘాన్ని కవిత కోరారు. వాటిని అధ్యయనం చేయడానికి తగిన సమయం కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం పూర్తి సమాచారం అందించిన తర్వాతే విచారణ నిర్వహించాలని పేర్కొన్నారు.

**పేరు విషయంలో ఈసీకి వివరణ**

తెలంగాణ రక్షణ సేన అనే పేరును పూర్తిగా స్వతంత్రంగా ఎంపిక చేశామని కవిత స్పష్టం చేశారు. దేశంలో ఇదే పేరుతో మరో రాజకీయ పార్టీ నమోదు కాలేదని తెలిపారు. రాజకీయ పార్టీల పేర్లను విడివిడిగా కాకుండా మొత్తం పేరుగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సంఘం ప్రస్తావించిన ఇతర పార్టీల పేర్లు ఉచ్చారణ, నిర్మాణం, నాయకత్వం పరంగా పూర్తిగా భిన్నమైనవని వివరించారు. దేశవ్యాప్తంగా ఒకే తరహా పదాలతో వందలాది పార్టీలు నమోదు అయ్యాయని గుర్తుచేస్తూ వాటి వివరాలను కూడా ఎన్నికల సంఘానికి సమర్పించినట్లు వెల్లడించారు.

**న్యాయబద్ధ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి**

ఊహాగానాలు, సంక్షిప్త రూపాల ఆధారంగా వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవద్దని కవిత కోరారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తరణ చేపట్టిన నేపథ్యంలో ఇప్పుడు పేరు మార్చాలని చెప్పడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 29ఏ ప్రకారం దాఖలు చేసిన దరఖాస్తును చట్టబద్ధంగా, నిష్పాక్షికంగా పరిశీలించి తెలంగాణ రక్షణ సేన, టీఆర్ఎస్ పార్టీకి గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

# నీళ్లు అడిగితే నెత్తురా?

- జల రాజకీయాల జ్వాలలు
- కాంగ్రెస్‌పై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- ఎక్స్ వేదికగా భావోద్వేగ విమర్శలు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో రైతులకు సాగునీరు అందించాల్సిన ప్రభుత్వం రాజకీయ విమర్శలకే పరిమితమైందని ఆరోపించారు. రైతులు నీళ్లు అడిగితే నెత్తురు ఇస్తామంటారా అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రతీకారానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. ఎండిపోతున్న పంటలను కాపాడటంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు.

**తెలంగాణ ఉద్యమ చరిత్ర ప్రస్తావన**

తన పోస్టులో తెలంగాణ ఉద్యమ చరిత్రను కూడా కేటీఆర్ ప్రస్తావించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు ఎన్నో అన్యాయాలు ఎదుర్కొన్నారని ఆరోపించారు. 1952 ఉద్యమం, 1969 తెలంగాణ ఉద్యమం, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ పోరాటాన్ని గుర్తు చేశారు. తెలంగాణ యువత ప్రాణత్యాగాలు, ఉద్యమంలో జరిగిన సంఘటనలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గతంలో అణిచివేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని పేర్కొన్నారు.

**రైతులకు నీళ్లు ఇవ్వాలన్న డిమాండ్**

కేటీఆర్ తన పోస్టులో ప్రధానంగా రైతుల సమస్యలను ప్రస్తావించారు. సాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని అన్నారు. "మా రక్తం ఎంత కావాలంటే అంత తీసుకోండి. కానీ రైతులకు నీళ్లు ఇవ్వండి" అంటూ భావోద్వేగంగా స్పందించారు. తెలంగాణ కోసం ఎన్నో పోరాటాలు చేసిన తాము రైతుల కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. నీటి కోసం ఉద్యమాలు చేసిన చరిత్ర తమదేనని, ఇప్పుడు కూడా రైతుల పక్షాన నిలబడతామని స్పష్టం చేశారు.

**కాళేశ్వరం.. రాజకీయ పోరు**

కాళేశ్వరం ప్రాజెక్టు, సాగునీటి అంశాలపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య విమర్శలు మరింత తీవ్రంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణ, నీటి పంపిణీపై సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలనలో జరిగిన అంశాలను ప్రస్తావిస్తూ ఎదురుదాడి చేస్తోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్ చేసిన తాజా పోస్టు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీసింది. రైతులకు సాగునీరు అందించడం, నీటి వనరులను సమర్థంగా వినియోగించడం వంటి అంశాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రాజకీయ విమర్శల కంటే రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, ఎండిపోతున్న పొలాలకు నీరు అందించడం ఇప్పుడు అత్యవసరమని తన పోస్టు ద్వారా కేటీఆర్ స్పష్టం చేశారు.

# నచ్చినట్లు చెప్తే మేధావులు, నిపుణులా ?

- ఉన్నది ఉన్నట్లు చెప్తే బీఆర్ఎస్ మనుషులా ?
- సీఎంవి అన్నీ అబద్ధాలే.. వాస్తవాల వక్రీకరణ
- రేవంత్ వ్యాఖ్యలకు హరీశ్‌రావు స్ట్రాంగ్ కౌంటర్




**• సాగునీటి గణాంకాలు ప్రస్తావించిన హరీశ్‌రావు**

2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 6.64 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో మాత్రం రికార్డు స్థాయిలో 48.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందించినట్లు తెలిపారు. మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ముఖ్యంగా పాలమూరు జిల్లాలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి తమ పాలనలోనే ఏర్పడిందని చెప్పారు.

**• కాళేశ్వరం అంశంపై విమర్శలు**

కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు ఆయనకు సాంకేతిక పరిజ్ఞానం లోపించిందనే విషయాన్ని బయటపెడుతున్నాయని హరీశ్‌రావు అన్నారు. మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను ప్రారంభించే అవకాశం ఉందని రిటైర్డ్ ఇంజినీర్లు వివరించినా ముఖ్యమంత్రి అర్థం చేసుకోలేకపోతున్నారని విమర్శించారు. కనీస సాంకేతిక అవగాహన లేకుండానే ప్రాజెక్టుపై వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు.

**• దేవాదుల, పట్టిసీమ ప్రాజెక్టులపై ప్రశ్నలు**


కన్నెపల్లి, సీతారామ ప్రాజెక్టుల వద్ద నీటిని నిల్వ చేస్తే పట్టిసీమ వైపు నీరు ఎలా వెళ్తుందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లను ఎందుకు నడపడం లేదని నిలదీశారు. వరంగల్ జిల్లాలో రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతులకు నీరు అందించాల్సిన సమయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

**• 'రక్తం' వ్యాఖ్యలపై తీవ్ర స్పందన**

రైతులకు నీళ్లు ఇవ్వాలని అడిగితే రక్తం పారిస్తానని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ఆయన మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. రైతుల ప్రయోజనాల కోసం అవసరమైతే తమ రక్తాన్ని కూడా అర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. తెలంగాణ కోసం పోరాడిన బీఆర్ఎస్ నాయకులు రైతుల హక్కుల కోసం ఎలాంటి త్యాగానికైనా వెనుకాడబోరని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి విమర్శలకు వాస్తవాలతోనే సమాధానం ఇస్తామని, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ సాధించిన విజయాలను ప్రజలు బాగా తెలుసునని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రస్తుతం నీటి ప్రాజెక్టుల అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విమర్శలు మరింత

# సెమీకండక్టర్ రంగంలో బంగారు భవిష్యత్

**యువతకు అశ్విని వైష్ణవ్ పిలుపు**



ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమలో దాదాపు 10 లక్షల మంది నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరత ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ అవకాశాన్ని భారత యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన ఇండస్ట్రీ లీడర్ టౌన్ హాల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్స్, ఐటీ, చిప్ డిజైన్ రంగాల్లో భారత్ ఇప్పటికే బలమైన స్థానం సంపాదించిందన్నారు. విద్యార్థులకు అత్యాధునిక చిప్ డిజైన్ నైపుణ్యాలు అందించేందుకు 315 విశ్వవిద్యాలయాలకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. దేశ ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం వేగంగా విస్తరిస్తోందని, ప్రస్తుతం దాని విలువ రూ.13 లక్షల కోట్లకు చేరిందని చెప్పారు. త్వరలో అది రూ.20 లక్షల కోట్లకు పెరుగుతుందని అంచనా వేశారు. ఇప్పటికే ఈ రంగంలో 25 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని తెలిపారు. తెలంగాణలో 104 ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలు పనిచేస్తుండగా, నాలుగు భారీ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను కేంద్రం మంజూరు చేసిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజన్‌తో సెమీకండక్టర్లు, బుల్లెట్ రైళ్లు, ఆధునిక రైల్వే వ్యవస్థ వంటి రంగాల్లో భారత్ ప్రపంచస్థాయికి చేరుకుంటోందని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.



# సింగరేణి కార్మికులకు బీజేపీ భరోసా

- రేపటి నుంచి కిషన్ రెడ్డి నేతృత్వంలో యాత్ర
- రెండు రోజుల పర్యటనకు శ్రీకారం

సింగరేణి కార్మికులకు భరోసా కల్పించేందుకు భారతీయ జనతా పార్టీ రెండు రోజుల సింగరేణి భరోసా యాత్ర చేపట్టనుంది. తాడిచెర్ల 2 బొగ్గు బ్లాక్ కేటాయింపు నేపథ్యంలో కార్మికుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు రఘునాథరావు తెలిపారు. సింగరేణి భవిష్యత్తుపై ఎలాంటి ఆందోళన అవసరం లేదనే సందేశాన్ని కార్మికులకు చేరవేయనున్నట్లు చెప్పారు.

**కిషన్ రెడ్డి నేతృత్వంలో పర్యటన**

జూలై 13, 14 తేదీల్లో జరిగే ఈ యాత్రకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు నాయకత్వం వహించనున్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి, శాసన మండలి ఫ్లోర్ లీడర్ ఏవీఎన్ రెడ్డి, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరిన బృందం ముందుగా కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయానికి చేరుకుని కార్మికులతో సమావేశమవుతుంది.

**నాలుగు జిల్లాల్లో విస్తృత కార్యక్రమాలు**

యాత్రలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో పర్యటన కొనసాగుతుంది. మూడు బహిరంగ సభలు, ఐదు బొగ్గు గనుల వద్ద గేట్ మీటింగ్‌లు నిర్వహించి కార్మికులతో నేరుగా మాట్లాడనున్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై పార్టీ తన వైఖరిని వివరించనుంది. ఈ యాత్ర ద్వారా సింగరేణి ప్రాంతంలో పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు కార్మికుల్లో విశ్వాసం పెంపొందుతుందని బీజేపీ నాయకత్వం భావిస్తోంది.

# కాంగ్రెస్ డైరెక్షన్

- -బీఆర్ఎస్ యాక్షన్
- 'రక్తకన్నీరు-2' గాధలు
- కాళేశ్వరం రాజకీయాలు



**'రక్తకన్నీరు' నాగభూషణాన్ని మించిన నటన**

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఇద్దరూ 'రక్తకన్నీరు' సినిమాలోని నాగభూషణం పాత్రను మించి నటిస్తున్నారని బండి సంజయ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఒకవైపు కాంగ్రెస్ బీఆర్ఎస్‌ను నిందిస్తోందని, మరోవైపు బీఆర్ఎస్ కాంగ్రెస్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేస్తోందని అన్నారు. కానీ ఈ మాటల యుద్ధంలో నష్టపోతున్నది మాత్రం తెలంగాణ రైతేనని పేర్కొన్నారు. ప్రజలకు సాగునీరు అందించాల్సిన సమయంలో భావోద్వేగ రాజకీయాలు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని హితవు పలికారు.

**కాళేశ్వరం కోమాలోకి వెళ్లిందెవరి వల్ల?**

కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై కూడా బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ... ఎన్‌డీఎస్‌ఏ నివేదికలు వచ్చి చాలా కాలం గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం మరమ్మతు పనులు చేపట్టకుండా ప్రాజెక్టును కోమాలోకి నెట్టిందని ఆరోపించారు. డ్యామ్ సేఫ్టీ చట్టం ప్రకారం బ్యారేజీల నిర్వహణ బాధ్యత పూర్తిగా తెలంగాణ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. ఎన్‌డీఎస్‌ఏ, సెంట్రల్ వాటర్ కమిషన్ సిఫార్సులు మాత్రమే ఇస్తాయని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

**విచారణ ఎక్కడ? చర్యలు ఎక్కడ?**

కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందని అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పెద్దఎత్తున ఆరోపణలు చేసిందని బండి సంజయ్ గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పూర్తి స్థాయి విచారణ చేయకుండా పరిమిత అంశాలకే కేసును కుదించిందని విమర్శించారు. విజిలెన్స్ నివేదిక వచ్చిందంటే దానిని ప్రజల ముందుంచే ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోకుండా ఇప్పుడు రాజకీయ విమర్శలకే పరిమితం కావడం వెనుక ఉద్దేశం ఏమిటని నిలదీశారు.

**రైతులే అసలు బాధితులు**

కాంగ్రెస్ పాలనలో నిర్లక్ష్యం, బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవకతవకల కారణంగా గోదావరి జలాలను తెలంగాణ రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు పక్కనపెట్టి వెంటనే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనలను యుద్ధప్రాతిపదికన అమలు చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. లేదంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలూ తెలంగాణ రైతుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయ డ్రామాలకు ప్రాధాన్యం ఇస్తున్న రెండు పార్టీల తీరును తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# అయోధ్యపై లేదు రాజీ

- పొలిటికల్ వార్‌లో కాంగ్రెస్ బిజీ
- రామమందిరం విరాళాల వివాదం
- బీజేపీని ఇరుకునపెట్టేలా కాంగ్రెస్ సమరం



అయోధ్య రామమందిరం విరాళాల వినియోగంపై తలెత్తిన వివాదం దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. ఈ అంశాన్ని కేంద్రంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్‌పై దాడి ముమ్మరం చేసింది. రామమందిరం నిర్వహణలో పారదర్శకత ఉండాలని, విరాళాల వినియోగంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఆలయ నిర్వహణపై భక్తులకు స్పష్టమైన సమాచారం అందాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ వివాదం ద్వారా అయోధ్య అంశంపై కొత్త రాజకీయ కథనాన్ని నిర్మించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ట్రస్ట్ నిర్వహణపై కాంగ్రెస్ ప్రశ్నలు

శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ కార్యవర్గంపై కాంగ్రెస్ వరుసగా ఆరోపణలు చేస్తోంది. ట్రస్ట్‌లో ఉన్న కొందరు పదాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ వ్యవహారంపై మౌనం వీడి స్పందించాలని కూడా కోరుతోంది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. గత కొద్ది రోజుల్లో దేశ వ్యాప్తంగా పలు విలేకరుల సమావేశాలు నిర్వహిస్తూ ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది.

### అయోధ్యపై కాంగ్రెస్ వైఖరిలో మార్పులు

అయోధ్య అంశంపై కాంగ్రెస్ వైఖరి గత నాలుగు దశాబ్దాల్లో పలు మార్లు మారింది. 1986లో వివాదాస్పద స్థలంలోని తాళాలు తెరవడం రాజీవ్ గాంధీ ప్రభుత్వ కాలంలో జరిగింది. 1989లో శిలాన్యాసానికి కూడా అప్పటి ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. తర్వాత 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం కాంగ్రెస్ పూర్తిగా భిన్నమైన వైఖరి అవలంబించింది. రాజ్యాంగం, న్యాయవ్యవస్థ ఆధారంగానే ఈ వివాదానికి పరిష్కారం రావాలని పార్టీ పదేపదే ప్రకటించింది.

### సుప్రీంకోర్టు తీర్పు తర్వాత మారిన పరిస్థితులు

2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ స్వాగతించింది. రామమందిర నిర్మాణానికి తమకు వ్యతిరేకత లేదని కూడా ప్రకటించింది. అయితే 2024లో జరిగిన ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి పార్టీ అగ్రనాయకత్వం హాజరు కాలేదు. ఆ కార్యక్రమాన్ని విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ నిర్వహించిన రాజకీయ కార్యక్రమంగా అభివర్ణించింది. ఈ నిర్ణయం అప్పట్లో విస్తృత చర్చకు దారితీసింది.

### అయోధ్య రాజకీయాల్లో కొత్త సమీకరణలు

ఇప్పుడు రామమందిర విరాళాల వివాదాన్ని కేంద్రంగా చేసుకుని కాంగ్రెస్ తన రాజకీయ వ్యూహాన్ని మరోసారి మార్చినట్లు కనిపిస్తోంది. ఆలయం ఏ ఒక్క సంస్థకు చెందినది కాదని, కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అని పార్టీ చెబుతోంది. అందుకే ట్రస్ట్ పనితీరులో జవాబుదారీతనం, పారదర్శకత ఉండాలని డిమాండ్ చేస్తోంది. మరోవైపు ఈ ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ వివాదం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కూడా ప్రతిధ్వనించే అవకాశం కనిపిస్తోంది. అయోధ్య అంశం మరోసారి జాతీయ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారుతున్న వేళ, ఈ పరిణామాలు భవిష్యత్తులో రాజకీయ సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

## విరాళాల వివాదం

- నిందితులకు శిక్ష పడే వరకు పోరాటం
- రామాలయ వివాదంపై కేజ్రీవాల్ సమరం



అయోధ్య రామజన్మభూమి ఆలయంలో విరాళాల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మరోసారి బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. నిందితులకు కఠిన శిక్ష పడే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన సుందరకాండ పారాయణ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, రాముడి పేరుతో ఓట్లు అడిగినవారు ఇప్పుడు భక్తుల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యతను విస్మరించారని ఆరోపించారు.

### విచారణపై అనుమానాలు

రామాలయానికి సంబంధించిన భూవ్యవహారాలు, నిర్మాణ ప్రక్రియ, భక్తులు సమర్పించిన విరాళాల అంశాల్లో వచ్చిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరగలేదని కేజ్రీవాల్ అన్నారు. ఈ కేసులో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం, నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రజల్లో నమ్మకం కలిగించలేకపోయాయని వ్యాఖ్యానించారు. పూర్తి స్థాయి పారదర్శక విచారణ జరిగితేనే నిజాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు.

### సీసీటీవీ దృశ్యాలపై ఆరోపణలు

ఆలయ ప్రాంగణంలో జరిగినట్లు చెబుతున్న దొంగతనాలపై కూడా కేజ్రీవాల్ ప్రశ్నలు లేవనెత్తారు. వరుసగా అనేక రోజుల పాటు జరిగిన ఘటనలు సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయని, అయితే ఎనిమిది నెలల వీడియో దృశ్యాలు తొలగించబడ్డాయనే ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. ఈ అంశంపై స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. భక్తుల సమర్పించిన కానుకల విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా విచారణ జరగాలని కోరారు.

### భక్తులకు పిలుపు

ఈ వివాదం కేవలం ఆర్థిక అక్రమాలకు సంబంధించినది మాత్రమే కాదని, కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించిన అంశమని కేజ్రీవాల్ పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు ఎవరూ మౌనం పాటించవద్దని భక్తులకు పిలుపునిచ్చారు. రామాలయ పవిత్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజల విశ్వాసానికి భంగం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.

### బీజేపీ ఎదురుదాడి

కేజ్రీవాల్ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు హర్ష్ మల్హోత్రా స్పందిస్తూ కేజ్రీవాల్‌ను "రాజకీయ హిందువు"గా అభివర్ణించారు. సుందరకాండ పారాయణం రాజకీయ ప్రయోజనాల కోసమే నిర్వహిస్తున్నారని ఆరోపించారు. రామాలయ నిర్మాణంపై గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ ఇప్పుడు రాజకీయంగా రాముడి పేరును ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ఇదిలా ఉండగా రామాలయ విరాళాల వ్యవహారంపై ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. సంబంధిత అంశాలపై విచారణ కొనసాగుతోందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు ఈ ఆరోపణల విషయంలో ఏ వ్యక్తిపైనా న్యాయస్థానం తప్పు నిర్ధారించలేదు.

## భావాలకు ప్రాణం పోసిన గానకోకిల

- ఎస్. జానకి చిరస్థాయి సంగీత ప్రస్థానం
- స్వరంలో శాశ్వతంగా నిలిచిన గానగాథలు
- పద్మభూషణ్‌ను తిరస్కరించిన గాయని



దక్షిణ భారత సినీ సంగీత చరిత్రలో ఎప్పటికీ చెరగని ముద్ర వేసిన గానకోకిల ఎస్. జానకి 1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో జన్మించారు. చిన్నప్పటి నుంచే సంగీతంపై ఆసక్తి పెంచుకున్న ఆమె అక్కతో కలిసి సంగీత పాఠాలకు వెళ్లేవారు. సహజమైన గాత్ర ప్రతిభను గుర్తించిన గురువు ఆమెకు కర్ణాటక సంగీతంలో శిక్షణ ఇచ్చారు. చిన్న వయసులోనే ఆల్ ఇండియా రేడియో సంగీత పోటీలో బహుమతి సాధించడం ఆమె ప్రతిభకు తొలి గుర్తింపుగా నిలిచింది. ఆ తర్వాత సినీ అవకాశాల కోసం చెన్నై చేరుకుని సంగీత దర్శకుడు టి. చలపతి రావు ప్రోత్సాహంతో చిత్రసీమలో అడుగుపెట్టారు.

### ఆరు దశాబ్దాల అద్భుత సంగీత ప్రయాణం

1957లో తెలుగు చిత్రం ఎంఎల్ఏ ద్వారా సినీ గాయని జీవితాన్ని ప్రారంభించిన జానకి వెనుదిరిగి చూడలేదు. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, సింహళం సహా 18 భాషల్లో సుమారు 48 వేలకు పైగా పాటలు ఆలపించారు. ప్రతి పాటలో భావాన్ని జీవింపజేసే గాత్రం ఆమె ప్రత్యేకతగా నిలిచింది. ఆనందం, ప్రేమ, భక్తి, బాధ, మాతృత్వం, చిలిపితనం వంటి ప్రతి భావాన్ని తన స్వరంతో శ్రోతల హృదయాల్లో నిలిపారు.

### సంగీత దర్శకుల అభిమాన గాయని

టి. చలపతిరావుతో ప్రారంభమైన ఆమె ప్రయాణం ఎం.ఎస్. విశ్వనాథన్, కె.వి. మహదేవన్, జి. రామనాథన్, ఎం.బి. శ్రీనివాసన్ వంటి దిగ్గజ సంగీత దర్శకుల వరకు విస్తరించింది. తరువాత ఇళయరాజాతో ఆమె కుదిరిన సంగీత ప్రయాణం దక్షిణ భారత సినీ సంగీతానికి స్వర్ణయుగంగా నిలిచింది. అన్నకిలి, 16 వయతినిలే, మౌనరాగం, దేవర్ మగన్, సంగమం, జెంటిల్‌మన్, కాదలన్, ఉయిరే వంటి చిత్రాల్లో ఆమె ఆలపించిన గీతాలు చిరస్మరణీయమయ్యాయి. ఏ.ఆర్. రెహమాన్ సంగీతంలో కూడా ఆమె స్వరం ప్రత్యేక గుర్తింపు సంపాదించింది.

### భావాలకు అద్దం పట్టిన గానం

జానకి గాత్రంలోని భావవ్యక్తీకరణే ఆమెను ఇతరుల కంటే ప్రత్యేకంగా నిలబెట్టింది. శాస్త్రీయ సంగీతం, జానపద గీతాలు, ప్రేమగీతాలు, విషాద గీతాలు, భక్తి గీతాలు, హాస్యగీతాలు, యుగళగీతాలు అన్నింటినీ ఒకే స్థాయిలో ఆలపించగలిగారు. సింగార వెలనే దేవా, చిన్నంచిరియా వన్నపరవై, సెంతోర పూవే, చిన్న చిన్న వన్నకుయిల్, అళగియా కన్నే, సొల్లయో వాయి తిరందు వంటి పాటలు ఆమె గాత్ర మాధుర్యానికి నిదర్శనాలుగా నిలిచాయి. తెరపై కనిపించే పాత్ర భావాన్ని స్వరంలో ప్రతిబింబించడం ఆమెకు మాత్రమే సాధ్యమైందని సంగీత విమర్శకులు పేర్కొంటారు.

### పురస్కారాలు.. గౌరవాలు

ఎస్. జానకి నాలుగు సార్లు జాతీయ ఉత్తమ నేపథ్య గాయని పురస్కారం అందుకున్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం నుంచి పదికి పైగా రాష్ట్ర అవార్డులు సహా అనేక రాష్ట్ర ప్రభుత్వాల గౌరవాలు ఆమెకు లభించాయి. ఎన్నో సంగీత సంస్థలు జీవిత సాఫల్య పురస్కారాలతో సత్కరించాయి. దక్షిణ భారత సంగీత ప్రపంచంలో ఆమెను "గానకోకిల", "దక్షిణాది నైటింగేల్"గా అభిమానులు గౌరవించారు.

### పద్మభూషణ్‌ను తిరస్కరించిన గాయని

2013లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని ఎస్. జానకి తిరస్కరించడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దశాబ్దాల పాటు వేలాది పాటలతో సేవ చేసిన తర్వాత ఆలస్యంగా గుర్తింపు ఇవ్వడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. నిజంగా తన సేవలను గుర్తించాలనుకుంటే అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న ఇవ్వాల్సిందని పేర్కొన్నారు. కళాకారులను వారు జీవించి ఉన్నప్పుడే గౌరవించాలని కూడా ఆమె స్పష్టం చేశారు.

### నిరాడంబర జీవితం.. చిరస్థాయి వారసత్వం

అంతటి ఖ్యాతి సంపాదించినప్పటికీ జానకి వ్యక్తిగత జీవితంలో అత్యంత నిరాడంబరంగా ఉండేవారు. ఎలాంటి ఆర్భాటానికి దూరంగా సాధారణ వ్యక్తిలా జీవించారు. సహగాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, కె.జే. యేసుదాస్, పీ.బీ. శ్రీనివాస్, పి. సుశీల వంటి దిగ్గజాలతో కలిసి ఎన్నో అమరగీతాలను అందించారు. సంగీతమే తన జీవితం అన్నట్లు గడిపిన ఆమె స్వరం తరతరాల శ్రోతలకు చిరస్థాయిగా నిలిచిపోయింది.

### శరీరం దూరమైనా స్వరం చిరంజీవే

2026 జూలై 11న 88 ఏళ్ల వయసులో ఎస్. జానకి కన్నుమూసినా ఆమె గానం ఎప్పటికీ మరణించదు. దక్షిణ భారత ప్రజల భావోద్వేగాల్లో ఆమె స్వరం శాశ్వతంగా నిలిచిపోయింది. ఒక పాటను కేవలం పాడకుండా అందులోని పాత్రకు ప్రాణం పోసిన అరుదైన గాయని ఆమె. సంగీతం ఉన్నంత కాలం ఎస్. జానకి పేరు, ఆమె గాత్రం, ఆమె సృష్టించిన మాధుర్యం చిరస్థాయిగా మార్మోగుతూనే ఉంటాయి. ఆమె స్వరం ప్రతి తరానికి స్ఫూర్తి, ప్రతి సంగీతాభిమానికీ చిరకాల జ్ఞాపకంగా నిలుస్తుంది.

## గానకోకిలకు అశ్రునివాళి

- కన్నీరుమున్నీరైన అభిమానులు
- ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ వీడ్కోలు

భారతీయ సినీ సంగీత ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోయిన గానకోకిల ఎస్. జానకికి మైసూరులో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మైసూరు సమీపంలోని కనియనహుండి గ్రామంలోని ఆమె ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులు, బంధువులు, సినీ ప్రముఖులు, వేలాది మంది అభిమానుల సమక్షంలో అంతిమ సంస్కారాలు జరిగాయి. జానకి మనవరాలు వైద్యుల అంత్యక్రియలను నిర్వహించారు. ప్రభుత్వ లాంఛనాలతో సాగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు నివాళులర్పించారు.

### చివరి చూపు కోసం అభిమానుల రద్దీ

అంతకుముందు జానకి భౌతికకాయాన్ని మైసూరులోని మహారాజా కళాశాల మైదానంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆమెను చివరిసారిగా చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలువురు కళాకారులు, రాజకీయ ప్రముఖులు, సంగీతాభిమానులు పుష్పాంజలి ఘటించి కన్నీరుతో వీడ్కోలు పలికారు. అనంతరం ప్రత్యేక వాహనంలో భౌతికకాయాన్ని ఫామ్‌హౌస్‌కు తరలించారు.

### పకడ్బందీ ఏర్పాట్లు

అంత్యక్రియల కోసం జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఫామ్‌హౌస్‌కు వెళ్లే మార్గమంతా బ్యారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసులు భారీగా మోహరించి ప్రజల రాకపోకలను నియంత్రించారు. అభిమానులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం ప్రశాంతంగా ముగిసేలా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు.

### ఆరు దశాబ్దాల అపూర్వ సంగీత ప్రస్థానం

ఎస్. జానకి ఆరు దశాబ్దాలకు పైగా సాగిన సంగీత ప్రయాణంలో దక్షిణ భారత సినీ సంగీతానికి చిరస్మరణీయ సేవలు అందించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ సహా అనేక భాషల్లో వేలాది పాటలు ఆలపించి కోట్లాది మంది హృదయాలను గెలుచుకున్నారు. తరతరాల సంగీత దర్శకులతో కలిసి పనిచేసి తన గాత్రంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఆమె ఆలపించిన ఎన్నో గీతాలు ఇప్పటికీ సంగీతాభిమానుల పెదవులపై నిలిచే ఉన్నాయి.

### ఎప్పటికీ చిరస్థాయిగా జానకి గానం

సంగీత ప్రపంచానికి ఎస్. జానకి చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రముఖులు కొనియాడారు. ఆమె స్వరం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. 2013లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని ఆలస్యంగా ప్రకటించారని భావించి ఆమె తిరస్కరించడం కూడా ఆమె వ్యక్తిత్వానికి నిదర్శనంగా నిలిచింది. భౌతికంగా జానకి ఇకలేకపోయినా ఆమె గాత్రమాధుర్యం ఎప్పటికీ సంగీత ప్రపంచంలో చిరస్థాయిగా మార్మోగుతూనే ఉంటుంది. అభిమానుల హృదయాల్లో ఆమెకు ప్రత్యేక స్థానం ఎల్లప్పుడూ నిలిచి ఉంటుంది.

## మోదీజీ హామీ నిలబెట్టుకోండి

- జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వండి
- ప్రధానిపై సీఎం ఒమర్ అబ్దుల్లా ఒత్తిడి
- హోదా కోసం జూలై 20న ఢిల్లీలో ధర్నా



జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీకి విలువ ఉండాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. జమ్మూలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, దేశ ప్రధానమంత్రి ఇచ్చే హామీ సాధారణ మాట కాదని, దానిని అమలు చేసే దిశగా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. కత్రాలో ప్రధాని చేసిన ప్రకటనను గుర్తుచేస్తూ, "ఇది మోదీ హామీ" అని చెప్పిన మాటలు ఇప్పుడు ఆచరణలో కనిపించాలని అన్నారు.

### రాష్ట్ర హోదా ప్రజల హక్కు

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ ఒక్క రాజకీయ పార్టీ డిమాండ్ కాదని, ప్రతి పౌరుడి ఆకాంక్ష అని ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు. ఈ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని పిలుపునిచ్చారు. జూలై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలు కలిసి రావాలని ఆహ్వానించారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందున ప్రజల హక్కుల కోసం అందరూ ఒక్కటిగా నిలబడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

### ఆర్టికల్ 370 తర్వాత మారిన పరిస్థితులు

2019లో కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370 ప్రత్యేక హోదాను రద్దు చేసి జమ్మూకశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చిన తర్వాత రాష్ట్ర హోదా అంశం నిరంతరం చర్చల్లో ఉంది. 2024 ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఒమర్ అబ్దుల్లా పలుమార్లు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమై రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోరారు. ఇప్పుడు మరోసారి ఈ డిమాండ్‌ను ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

### బీజేపీపై విమర్శలు

బీజేపీపై కూడా ఒమర్ అబ్దుల్లా తీవ్ర విమర్శలు చేశారు. అధికారంలోకి నేరుగా రాలేకపోతే ఇతర పార్టీలను చీల్చి వెనుక ద్వారం ద్వారా పాలన సాగించాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మహారాష్ట్రలో శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే పార్టీల్లో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ బీజేపీ తీరును ప్రశ్నించారు. తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు కోట్ల రూపాయల ఆఫర్లు ఇచ్చారనే ఆరోపణలను కూడా మరోసారి ప్రస్తావించారు.

### జూలై 20 నిరసనకు మద్దతు

జూలై 20న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల మొదటి రోజున జంతర్ మంతర్ వద్ద నేషనల్ కాన్ఫరెన్స్ ధర్నా నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి సీపీఎం మద్దతు ప్రకటించింది. జమ్మూకశ్మీర్ ప్రజల రాజ్యాంగ హక్కులను పునరుద్ధరించాల్సిన సమయం వచ్చిందని సీపీఎం నాయకత్వం పేర్కొంది. రాష్ట్ర హోదా ఆలస్యం అవుతున్న కొద్దీ ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి కూడా రాష్ట్ర హోదా తిరిగి వస్తే ఉపాధి, అభివృద్ధి, పాలనకు సంబంధించిన అనేక సమస్యలను సమర్థంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ నేపథ్యంలో జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా అంశం మరోసారి జాతీయ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది.

## భావనారుషి ఆలయ భూముల పరిరక్షణకు పాలకవర్గం పాదయాత్ర

- అక్రమ పద్ధతుల్లో విక్రయాలు మానుకోవాలని డిమాండ్
- సంతాబజార్ దేవస్థానం నుండి రోశయ్య కాలనీ వరకు సాగిన నిరసన ప్రదర్శన




**చీరాల, జులై 12 (నాదేశం) :** చీరాల సంతాబజార్‌లో వేంచేసియున్న శ్రీ భద్రావతి సమేత భావనారుషి దేవాలయ భూముల పరిరక్షణకై ఆలయ పాలకవర్గం సమర శంఖం పూరించింది. దేవస్థానానికి చెందిన విలువైన భూములను కొందరు అక్రమ పద్ధతుల్లో విక్రయిస్తున్నారని, ఆ విక్రయాలను తక్షణమే మానుకోవాలని కోరుతూ ఆలయ పాలకవర్గం ఆధ్వర్యంలో ఆదివారం భారీ పాదయాత్ర నిర్వహించారు. సంతాబజార్‌లోని భావనాఋషి దేవాలయం వద్ద ప్రారంభమైన ఈ పాదయాత్ర రోశయ్య కాలనీ వరకు సాగింది. ఎంతో చరిత్ర కలిగిన భావనాఋషి దేవాలయానికి భక్తులు, దాతలు సమర్పించిన భూములను అక్రమ మార్గాల్లో చేతులు మార్చడం అత్యంత విచారకరమన్నారు. ఆలయ ఆస్తులను, భూములను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఇలాంటి అక్రమ విక్రయాలకు పాల్పడితే సహించేది లేదని పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు హెచ్చరించారు. ఆలయ భూముల పరిరక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు.

## స్నేహమంటే ఇదేరా..!

### సినిమాను తలపించిన రియల్ సీన్

- 35 ఏళ్ల మాట నిలబెట్టుకున్న మిత్రుడు
- నాటి వెయ్యి అప్పుకు నేడు ₹ 25 వేలు చెల్లింపు
- మూడు దశాబ్దాల తర్వాత నిలబెట్టుకున్న వాగ్దానం




రూ.25 వేలతో ఆశ్చర్యపరిచిన ఇస్మాయిల్

డబ్బు విలువ కంటే మాట విలువ గొప్పదని నిరూపించిన అరుదైన ఘటన వెలుగులోకి వచ్చింది. 35 ఏళ్ల క్రితం తీసుకున్న చిన్న అప్పును మరచిపోకుండా తిరిగి చెల్లించిన కేరళకు చెందిన ఇస్మాయిల్ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. 1991లో సౌదీ అరేబియాలో ఉద్యోగం చేస్తున్న సమయంలో తెలంగాణలోని జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన ఏడ్ల లచ్చన్న నుంచి 120 సౌదీ రియాల్స్ అప్పుగా తీసుకున్నారు. అప్పట్లో ఆ మొత్తం విలువ దాదాపు రూ.1,000. అవకాశం వచ్చిన వెంటనే తిరిగి ఇస్తానని ఇచ్చిన మాటను ఇస్మాయిల్ ఎన్నడూ మర్చిపోలేదు.

### చిరునామా లేకపోయినా వెతికి చేరుకున్నాడు

కొద్ది కాలానికే లచ్చన్న భారత్‌కు తిరిగి వచ్చారు. ఆ రోజుల్లో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా లేకపోవడంతో ఇద్దరి మధ్య సంబంధం పూర్తిగా తెగిపోయింది. ఫోన్ నంబర్ లేదు. ఇంటి చిరునామా తెలియదు. ఒక్క ధర్మపురి అనే ఊరి పేరు మాత్రమే ఇస్మాయిల్‌కు గుర్తుంది. అదే ఆధారంగా ఇంటర్నెట్ లో వివరాలు సేకరించి ధర్మపురికి చేరుకున్నారు. స్థానికులను అడుగుతూ చివరకు లచ్చన్న కుటుంబాన్ని గుర్తించారు. లచ్చన్న అప్పటికి గల్ఫ్ దేశంలో ఉద్యోగంలో ఉండటంతో వాట్సాప్ వీడియో కాల్ ద్వారా ఇద్దరూ మళ్లీ ఎన్నో ఏళ్ల తర్వాత మాట్లాడుకున్నారు. తాను తీసుకున్న రూ.1,000 అప్పుకు బదులుగా ఇస్మాయిల్ లచ్చన్న కుటుంబానికి రూ.25 వేల నగదు అందించారు. వడ్డీ కలిపి లెక్క వేసి ఈ మొత్తం ఇచ్చి ఉండొచ్చని లచ్చన్న భావిస్తున్నారు. అయితే ఇస్మాయిల్ ఎంత లెక్క ప్రకారం ఈ మొత్తం నిర్ణయించారో తనకు తెలియదని చెప్పారు. చిన్న మొత్తాన్ని కూడా మరచిపోకుండా ఇన్ని సంవత్సరాల తర్వాత వెతుక్కుంటూ రావడం తనను భావోద్వేగానికి గురి చేసిందని వెల్లడించారు.

### స్నేహానికి నిలువెత్తు నిదర్శనం

సౌదీలో ఒకే గదిలో ఉంటూ కలిసి వంట చేసుకుని భోజనం చేసిన రోజులను లచ్చన్న గుర్తు చేసుకున్నారు. ఆ రోజుల్లో ఏర్పడిన స్నేహమే ఇంతకాలం తర్వాత కూడా నిలిచిందని చెప్పారు. ఇస్మాయిల్ నిజాయితీ గల వ్యక్తి అని, మాటకు విలువ ఇచ్చే మనిషి అని ప్రశంసించారు. డబ్బు కంటే నమ్మకం గొప్పదని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. కాలం మారినా, పరిస్థితులు మారినా, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలనే సంకల్పం ఉంటే సంబంధాలు ఎప్పటికీ చెదరవని ఈ సంఘటన స్పష్టంగా నిరూపించింది. నేటి సమాజంలో అరుదుగా కనిపించే నిజాయితీ, కృతజ్ఞత, స్నేహానికి ఈ ఘటన ఒక గొప్ప ఉదాహరణగా నిలిచింది.

ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి
4
GENERAL NEWS
సోమవారం 13 జులై 2026
www.prabhathakiranam.com

## రామాపురం బీచ్‌లో తప్పిపోయిన బాలుడు..
# తల్లిదండ్రులకు అప్పగించిన 'శక్తి టీమ్'

• ఆటోలో దొరికిన ఫోన్‌ను అప్పగించి
• నిజాయితీ చాటుకున్న డ్రైవర్ కోటేశ్వరరావు

**చీరాల రూరల్, జులై 12 (నాదేశం) :** వేటపాలెం మండలం రామాపురం బీచ్‌కు విహారయాత్రకు వచ్చిన ఓ కుటుంబానికి చీరాల సబ్ డివిజన్ 'శక్తి టీమ్' కొండంత అండగా నిలిచింది. బీచ్‌లో తప్పిపోయిన ఆరు సంవత్సరాల బాలుడిని సురక్షితంగా వెతికి తల్లిదండ్రులకు అప్పగించడంతో పాటు, మరో పర్యాటకుడు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను అందించడంలో కీలక పాత్ర పోషించింది. బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ మొయిన్ ఆధ్వర్యంలో శక్తి టీమ్ సభ్యులు రామాపురం బీచ్ లో రిసార్ట్స్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుండి మనోజ్, సౌజన్య దంపతులు తమ ఆరేళ్ల కుమారుడు గౌసిక్‌తో కలిసి సముద్ర స్నానాల కోసం ఇక్కడికి వచ్చారు. అయితే సముద్రం వద్ద రద్దీగా ఉండటంతో బాలుడు గౌసిక్ తప్పిపోయాడు. కంగారుపడిన తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో, అక్కడే విధుల్లో ఉన్న శక్తి టీమ్ సభ్యులైన కానిస్టేబుల్ కె. సుబ్బారావు, లేడీ కానిస్టేబుల్ సిహెచ్. సునీతలను ఆశ్రయించారు. వెంటనే అప్రమత్తమైన శక్తి టీమ్ సభ్యులు ఇద్దరూ బీచ్ పరిసరాల్లో గాలించి, బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వారాంతపు సెలవుల్లో పిల్లలతో వచ్చే యాత్రికులు సముద్ర స్నానాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను నిరంతరం గమనిస్తూ ఉండాలని సూచించారు.



ఇదే సమయంలో హైదరాబాద్‌కే చెందిన బాబు అనే పర్యాటకుడు తన స్నేహితుడితో కలిసి చీరాల నుండి ఆటోలో రామాపురం బీచ్ కు వచ్చాడు. బీచ్‌లోకి వెళ్లిన తర్వాత చూసుకోగా అతని మొబైల్ ఫోన్ కనిపించలేదు. ఆటోలో ఫోన్ ఉన్న విషయాన్ని గమనించిన డ్రైవర్ కోటేశ్వరరావు నిజాయితీగా ఆ ఫోన్‌ను శక్తి టీమ్ సభ్యులకు అప్పగించాడు. పోలీసులు వెంటనే ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తిని గుర్తించి, ఆటో డ్రైవర్ చేతుల మీదుగానే ఆ మొబైల్‌ను బాధితుడికి అప్పగించారు.

## అంధత్వ నివారణే లక్ష్యంగా ఉచిత కంటి వైద్య శిబిరం

**చీరాల, జులై 12 (నాదేశం) :** మండలంలోని విజయనగర కాలనీలో ఆదివారం ఉచితకంటివైద్యశిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. కీ.శే. దుడ్డు మాకయ్య, ముత్యాలమ్మ జ్ఞాపకార్థం గుంటూరు శంకర కంటి ఆసుపత్రి మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థల సంయుక్త సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉసురుపాటి ముసలయ్య ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిబిరానికి ముఖ్య అతిథులుగా ఐటీసీ జనరల్ మేనేజర్ ఎస్.ఎస్. శ్యాం సుందర్, ఐటీసీ సీనియర్ మేనేజర్ వి. శ్రీధర్ హాజరయ్యారు. శంకర కంటి ఆసుపత్రి ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రద్ధా లాజర్, డాక్టర్ హేమసాయి, గ్రామ పెద్ద తేళ్ల లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయనగర కాలనీతో పాటు దాని చుట్టుపక్కల ప్రాంతాలైన ఐక్య నగర్, రామనగర్, ఆదినారాయణపురం, పేరాల తదితర గ్రామాల నుండి ప్రజలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు.

వైద్య పరీక్షల అనంతరం కంటి శుక్లాలు లేదా ఇతర శస్త్రచికిత్సలు అవసరమైన రోగులను గుర్తించి, వారిని ఉచిత చికిత్సల నిమిత్తం గుంటూరులోని శంకర కంటి ఆసుపత్రికి తీసుకు వెళ్ళి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని వైద్యులు, తెలిపారు. ఈ శిబిరంలో గ్రామ పెద్దలు, యువకులు దుడ్డు వందనం, లోకయ్య, మార్క్, తేళ్ల మోషే, ఒంగోలు యేసు, ఇనగంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## వెలుగులోకి రహస్యం

• ముసుగు వీరుడు మొజ్తబా కాదు
• వీడిన ముసుగు మనిషి మిస్టరీ
• ఖమేనీ అంత్యక్రియల సీక్రెట్

ఇరాన్ మాజీ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల సమయంలో అందరి దృష్టిని ఆకర్షించిన ముసుగు ధరించిన వ్యక్తి ఎవరనే ప్రశ్నకు ఎట్టకేలకు సమాధానం లభించింది. అంత్యక్రియల ప్రార్థనల్లో ముందు వరుసలో నల్లటి ఫేస్ మాస్క్, నల్లటి క్యాప్ ధరించి కూర్చున్న వ్యక్తి ఫోటోలు ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయ్యాయి. మొదట అతడే ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీ అని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. భవిష్యత్తు వారసుడిగా భావిస్తున్న మొజ్తబా కావచ్చనే ఊహాగానాలు అంతర్జాతీయ మీడియాలోనూ వినిపించాయి. (**వివరాలు 5లో..**)




## ఇష్టారాజ్యానికి చెక్ ?
## నేడు విచారణ

**విమాన టికెట్ ధరలపై సుప్రీంకోర్టు దృష్టి**

**ప్రయాణికులకు ఊరట దొరుకుతుందా?**

దేశంలో విమాన టికెట్ ధరల్లో భారీ హెచ్చుతగ్గులపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు జులై 13న విచారించనుంది. న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ కేసును పరిశీలించనుంది. సామాజిక కార్యకర్త ఎస్. లక్ష్మీనారాయణన్ దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రైవేట్ విమానయాన సంస్థలు టికెట్ ధరలు, అదనపు ఛార్జీలను ఎలాంటి నియంత్రణ లేకుండా నిర్ణయిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని నియంత్రించే స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని, ప్రయాణికుల హక్కులను పరిరక్షించే స్వతంత్ర నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. (**వివరాలు 5లో..**)




## రేవంత్‌పై వ్యాఖ్యలు..

**వైసీపీ నేత నాగార్జున యాదవ్ అరెస్ట్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను తెలంగాణపోలీసులు అరెస్ట్‌చేశారు. గుంటూరులోని ఇన్నర్ రింగ్ రోడ్డులో ఉన్న ఆయన నివాసానికి వెళ్లిన బేగంబజార్ పోలీసులు అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించారు. ఇటీవల ఓ టీవీ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న నాగార్జున యాదవ్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఒక స్విగ్గీ, జొమాటో డెలివరీ బాయ్ అంటూ... దేశంలోనే అత్యంత దారుణంగా ఒక డెలివరీ బాయ్ ముఖ్యమంత్రి అయ్యాడంటూ సెటైర్లు వేశారు. అంతేకాదు, రేవంత్ రెడ్డికి ప్రభుత్వ జీవోలు కూడా చదవడం రాదంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై టీపీసీసీ సోషల్ మీడియా స్టేట్ కన్వీనర్ కైలాష్ సజ్జన్ ఫిర్యాదు చేయడంతో బేగంబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. అరెస్ట్ సమయంలో ముందస్తు నోటీసులు ఇవ్వలేదని నాగార్జున యాదవ్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తామని చెప్పిన తెలంగాణ పోలీసులు ఆయనను తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ అరెస్ట్‌పై కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయగా, ఎమ్మెల్సీ రఘురాం, నాగార్జున యాదవ్ భార్య జిల్లా ఎస్పీ దృష్టికి విషయం తీసుకెళ్లారు. ఈ పరిణామం రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

5లో..




## నాగార్జున యాదవ్ అరెస్ట్‌పై జోగి రమేష్ ఆగ్రహం

# రూ.80 వేల కోట్ల డీల్..

▪ ఎన్‌ఎఫ్‌ఎల్ జట్టు సొంతం
▪ భారత సంతతి వ్యాపారవేత్త



భారత సంతతికి చెందిన బిలియనీర్ వినోద్ ఖోస్లా అమెరికా ప్రముఖ ఎన్‌ఎఫ్‌ఎల్ జట్టు సియాటిల్ సీహాక్స్‌ను భారీ ఒప్పందంలో కొనుగోలు చేసి ప్రపంచ క్రీడారంగ దృష్టిని ఆకర్షించారు. సుమారు 9.612 బిలియన్ డాలర్లు, అంటే దాదాపు రూ.80,740 కోట్ల విలువైన ఈ డీల్ ఎన్‌ఎఫ్‌ఎల్ చరిత్రలోనే అత్యంత భారీ కొనుగోలుగా నిలిచింది. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు పాల్ అలెన్ మరణానంతరం ఆయన కుటుంబ ట్రస్ట్ ఈ జట్టును విక్రయించింది. ఈ విక్రయం ద్వారా వచ్చే మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు విరాళంగా అందించనున్నట్లు ట్రస్ట్ ప్రకటించింది. ఖోస్లా కుటుంబం ఇకపై సియాటిల్ సీహాక్స్ నియంత్రణ యజమానిగా వ్యవహరించనుంది. అయితే ఈ ఒప్పందానికి ఎన్‌ఎఫ్‌ఎల్ యజమానుల ఆమోదం అవసరం ఉంది. ప్రస్తుతం శాన్‌ఫ్రాన్సిస్కో 49ర్స్‌లో ఉన్న వాటాను విక్రయించిన తర్వాతే ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ డీల్ ప్రపంచ క్రీడా వ్యాపార చరిత్రలో మరో కీలక మైలురాయిగా నిలిచింది.

# గానకోకిలకు అశ్రునివాళి

◆ కన్నీరుమున్నీరైన అభిమానులు
◆ ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ వీడ్కోలు



3లో..

భారతీయ సినీ సంగీత ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోయిన గానకోకిల ఎస్. జానకికి మైసూరులో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మైసూరు సమీపంలోని కనియనహుండి గ్రామంలోని ఆమె ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులు, బంధువులు, సినీ ప్రముఖులు, వేలాది మంది అభిమానుల సమక్షంలో అంతిమ సంస్కారాలు జరిగాయి. జానకి మనవరాలు వైద్యుల అంత్యక్రియలను నిర్వహించారు. ప్రభుత్వ లాంఛనాలతో సాగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు నివాళులర్పించారు.

## భావాలకు ప్రాణం పోసిన గానకోకిల

◆ ఎస్. జానకి చిరస్థాయి సంగీత ప్రస్థానం
◆ స్వరంలో శాశ్వతంగా నిలిచిన గానగాథలు
◆ పద్మభూషణ్‌ను తిరస్కరించిన గాయని

# అయోధ్యపై లేదు రాజీ

• పొలిటికల్ వార్‌లో కాంగ్రెస్ బిజీ
• రామమందిరం విరాళాల వివాదం
• బీజేపీని ఇరుకునపెట్టేలా కాంగ్రెస్ సమరం



అయోధ్య రామమందిరం విరాళాల వినియోగంపై తలెత్తిన వివాదం దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. ఈ అంశాన్ని కేంద్రంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ భారతీయ జనతా పార్టీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై దాడి ముమ్మరం చేసింది. రామమందిరం నిర్వహణలో పారదర్శకత ఉండాలని, విరాళాల వినియోగంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఆలయ నిర్వహణపై భక్తులకు స్పష్టమైన సమాచారం అందాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ వివాదం ద్వారా అయోధ్య అంశంపై కొత్త రాజకీయ కథనాన్ని నిర్మించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. (**3లో..**)



# నిందితులకు శిక్ష పడే వరకు పోరాటం

## రామాలయ వివాదంపై కేజ్రీవాల్ సమరం

అయోధ్య రామజన్మభూమి ఆలయంలో విరాళాల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మరోసారి బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. నిందితులకు కఠిన శిక్ష పడే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన సుందరకాండ పారాయణ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, రాముడి పేరుతో ఓట్లు అడిగినవారు ఇప్పుడు భక్తుల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యతను విస్మరించారని ఆరోపించారు.

**విచారణపై అనుమానాలు**

రామాలయానికి సంబంధించిన భూవ్యవహారాలు, నిర్మాణ ప్రక్రియ, భక్తులు సమర్పించిన విరాళాల అంశాల్లో వచ్చిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరగలేదని కేజ్రీవాల్ అన్నారు. ఈ కేసులో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం, నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రజల్లో నమ్మకం కలిగించలేకపోయాయని వ్యాఖ్యానించారు. పూర్తి స్థాయి పారదర్శక విచారణ జరిగితేనే నిజాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. (**3లో..**)

# ప్రొక్లెయిన్ నడిపి పనులను ప్రారంభించిన బాలకృష్ణ




**వాట్సాప్ మెసేజ్ చేస్తే.. సమస్య పరిష్కరిస్తానని భరోసా**


హిందూపురం ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేరుగా వాట్సాప్‌లో తనను సంప్రదించాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. హిందూపురం పర్యటనలో భాగంగా మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి రూ.790 కోట్ల వ్యయంతో చేపడుతున్న మడకశిర బ్రాంచ్ కాలువ విస్తరణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ప్రొక్లెయిన్ నడిపి పనులను ప్రారంభించారు. చౌడేశ్వరి కాలనీలో పార్కు, ప్రభుత్వాసుపత్రిలో రక్తనిధి కేంద్రం, ఇండోర్ స్టేడియం, వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. టేబుల్ టెన్నిస్, షటిల్ ఆడి ఆకట్టుకున్నారు. హిందూపురాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని బాలకృష్ణ స్పష్టం చేశారు.

## అమరావతిపై విష ప్రచారం..

**వైసీపీపై నక్కా ఆనందబాబు విమర్శలు**

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు అమరావతి రాజధాని అంశంపై వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. రాజధాని అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా వైసీపీ ఇప్పటికీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రాజధాని నిర్మాణానికి 99.5 శాతం మంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని, భూములు ఇవ్వని అరశాతం మంది రైతులను అడ్డం పెట్టుకుని అమరావతిపై విష ప్రచారం సాగిస్తోందని అన్నారు. సీఆర్డీఏ చేపట్టిన ఈ3 సీడ్ యాక్సెస్ రోడ్‌కు అవసరమైన భూసేకరణ పూర్తిగా చట్టబద్ధంగానే జరిగిందని స్పష్టం చేశారు. ఉండవల్లిలో అవసరమైన భూమిలో ఎక్కువ భాగాన్ని రైతులే స్వచ్ఛందంగా ఇచ్చారని, చివరకు కేవలం 2.725 ఎకరాల భూమికి మాత్రమే భూసేకరణ చేపట్టాల్సి వచ్చిందని వివరించారు. మెజారిటీ రైతుల అభిప్రాయాలను పక్కనబెట్టి కొద్దిమంది పేరుతో రాజధాని అభివృద్ధిని అడ్డుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అనే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతోందని నక్కా ఆనందబాబు తెలిపారు.





## మౌనంగా లేను..
## దిగజారండి.. దిగజారండి..

**ఎంత దిగజారుతారో చూస్తూ ఉంటా..**


**ప్రశ్నించే గొంతులపై దుష్ప్రచారం**


**జస్ట్ ఆస్కింగ్ అంటూ ప్రకాశ్ రాజ్ నిప్పులు**

"మౌనంగా లేను.. దిగజారండి.. దిగజారండి.. ఎంత దిగజారుతారో చూస్తూ ఉంటా" అంటూ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రశ్నించే గొంతులపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా తప్పుబడుతూ సోషల్ మీడియా వేదికగా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తాను మౌనంగా లేనని, జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నానని పేర్కొన్నారు. అధికార ప్రభావంతో కొంత మీడియా వ్యవహరిస్తోందని విమర్శించిన ఆయన, నిబద్ధతతో పనిచేసే స్వరాలను లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారం సాగుతోందని అన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను గౌరవించాల్సిన అవసరం ఉందని సూచించారు. తనపై వస్తున్న విమర్శలకు ఇదే సమాధానమంటూ, విలువలు కోల్పోయి దిగజారుతున్న వారిని చరిత్రే తీర్పు చెబుతుందని వ్యాఖ్యానించారు. సత్యాన్ని ప్రశ్నించే వారిని భయపెట్టడం సాధ్యం కాదని, ప్రజలే చివరికి నిజాన్ని గుర్తిస్తారని ప్రకాశ్ రాజ్ అన్నారు.

## మత విద్వేషాల కుట్రలపై విచారణ జరపాలి: జనసేన

రాష్ట్రంలో మత సామరస్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు కాకినాడ జిల్లా పెద్దాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు. జడ శ్రావణ్, ప్రశ్న రావణ్ కార్యకలాపాల వెనుక వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రమేయం ఉందని ఆరోపించారు. ఏలూరులో నిర్వహించిన దళిత క్రైస్తవ శంఖారావం సభలో అసలు అంశాలను పక్కనబెట్టి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేయడం వెనుక రాజకీయ ఉద్దేశం ఉందన్నారు. రావణ్, జడ శ్రావణ్ కుమార్, ప్రకాష్ రాజ్ పాత్రలతో పాటు వారి ఆర్థిక లావాదేవీలు, విదేశీ నిధుల కోణంలో కూడా సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. పవన్ కళ్యాణ్‌పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేసిన తుమ్మల రామస్వామి బాబు, రాష్ట్రంలో శాంతి, సామరస్యాన్ని కాపాడేందుకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





5లో..

## పవన్‌కు చంద్రబాబు పరామర్శ

**ఆరోగ్యంపై ప్రత్యేక ఆరా • వేగంగా కోలుకుంటున్నారని వెల్లడి**

**ముంబయి ఆస్పత్రికి వచ్చిన సీఎం**

ముంబయిలోని కొకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం పరామర్శించారు. ఆసుపత్రికి చేరుకున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌తో కొద్దిసేపు మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పవన్ సతీమణి అన్నా కొనిదెలతో పాటు చికిత్స అందిస్తున్న వైద్య బృందంతో కూడా ఆయన మాట్లాడారు. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైందని, ప్రస్తుతం పవన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ముఖ్యమంత్రికి వివరించారు.



## గెలవలేమని తెలిసి మళ్లీ యుద్ధం

**ఇరాన్‌పై అమెరికా వార్‌తో రగడ • దాడులతో ఆర్థిక వ్యవస్థల కల్లోలం**

**ప్రపంచంతో ఆటలాడుకుంటున్న ట్రంప్**

గెలవలేని యుద్ధాన్ని కొనసాగిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచ దేశాలను పెనం మీద నుంచి పొయ్యిలోకి నెట్టేస్తున్న దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. గెలవడం కష్టమని తెలిసినా అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ట్రంప్ దూకుడు, అమెరికా దాడులు, ఇరాన్ ప్రతీకార చర్యలు మధ్యప్రాచ్యాన్ని మరోసారి అగ్నిగుండంగా మార్చుతున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు ప్రాణాధారమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేస్తున్నట్లు ప్రకటించడంతో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం నెలకొంది. ఒక ప్రాంతీయ ఘర్షణగా మొదలైన ఈ వివాదం ప్రపంచ మార్కెట్లను, ఇంధన ధరలను, దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదిపేసే స్థాయికి చేరుకుంటోంది. (**వివరాలు 5లో..**)

# పవన్‌కు చంద్రబాబు పరామర్శ

- ఆరోగ్యంపై ప్రత్యేక ఆరా
- వేగంగా కోలుకుంటున్నారని వెల్లడి
- ముంబయి ఆస్పత్రికి వచ్చిన సీఎం



ముంబయిలోని కొకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం పరామర్శించారు. ఆసుపత్రికి చేరుకున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌తో కొద్దిసేపు మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పవన్ సతీమణి అన్నా కొనిదెలతో పాటు చికిత్స అందిస్తున్న వైద్య బృందంతో కూడా ఆయన మాట్లాడారు. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైందని, ప్రస్తుతం పవన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ముఖ్యమంత్రికి వివరించారు.

### మూడున్నర గంటలపాటు శస్త్రచికిత్స

పరామర్శ అనంతరం మీడియాతో మాట్లాడిన చంద్రబాబు నాయుడు, నిపుణులైన వైద్యుల బృందం సుమారు మూడున్నర గంటలపాటు శస్త్రచికిత్స నిర్వహించిందని తెలిపారు. ఆపరేషన్ పూర్తిగా విజయవంతమైందని చెప్పారు. వైద్యుల సూచన మేరకు పవన్ కళ్యాణ్ మూడు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని, ఈ కాలంలో ఫిజియోథెరపీ కూడా కొనసాగుతుందని వెల్లడించారు. పూర్తి ఆరోగ్యం సాధించిన తర్వాతే ఆయన తిరిగి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

### ఏళ్లుగా భుజాల నొప్పితో ఇబ్బంది

పవన్ కళ్యాణ్ చాలా కాలంగా రెండు భుజాల నొప్పితో బాధపడుతున్నారని చంద్రబాబు వెల్లడించారు. ప్రజా సేవకు ప్రాధాన్యం ఇస్తూ చికిత్సను వాయిదా వేస్తూ వచ్చారని చెప్పారు. నిరంతర పర్యటనలు, ప్రజలను కలవడం, అభిమానులతో తరచూ మమేకం కావడం వల్ల గాయం తీవ్రత పెరిగిందని తెలిపారు. దీంతో శస్త్రచికిత్స తప్పనిసరి పరిస్థితి ఏర్పడిందని వివరించారు.

### ఎడమ భుజంపైనా వైద్యుల దృష్టి

కుడి భుజానికి శస్త్రచికిత్స పూర్తయినప్పటికీ, ఎడమ భుజంలో కూడా సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించినట్టు సమాచారం. ఆ సమస్యను ఆరు నెలల తర్వాత మరోసారి పరీక్షిస్తారని, అప్పటి పరిస్థితిని బట్టి శస్త్రచికిత్స అవసరమా లేక ఫిజియోథెరపీతో సరిపోతుందా అనే అంశంపై నిర్ణయం తీసుకుంటారని చంద్రబాబు చెప్పారు. ప్రస్తుతం కుడి భుజం కోలుకోవడంపైనే వైద్యులు దృష్టి సారించినట్లు తెలిపారు.

### త్వరగా విధుల్లోకి రావాలనే ఆసక్తి

వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించినప్పటికీ, వీలైనంత త్వరగా తిరిగి ప్రజా సేవలోకి రావాలని పవన్ కళ్యాణ్ ఆసక్తి వ్యక్తం చేసినట్లు చంద్రబాబు వెల్లడించారు. అయితే పూర్తి ఆరోగ్యం సాధించిన తర్వాతే విధుల్లోకి రావాలని వైద్యులు సూచించినట్టు చెప్పారు. పవన్ కళ్యాణ్ ఆరోగ్యం వేగంగా మెరుగుపడుతోందని, పునరావాస చికిత్స పూర్తయ్యాక మళ్లీ ప్రజల మధ్యకు వస్తారని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్ కూడా పవన్‌ను పరామర్శించారు.




# మారిపోనున్న సరిహద్దులు

- ₹14,115 కోట్ల మెగా ప్రణాళిక
- ఢిల్లీ-యూపీ రూపురేఖల్లో చేంజ్
- మెగా రోడ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- ఇకపై వేగంగా ప్రయాణానికి ఛాన్స్

దేశంలో రహదారి మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర మంత్రివర్గం రెండు కీలక ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. మొత్తం రూ.14,115 కోట్ల వ్యయంతో ఢిల్లీలో 8.1 కిలోమీటర్ల ఆరు లేన్ల సొరంగ మార్గం, ఉత్తరప్రదేశ్‌లో 117.7 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడంతో పాటు సరకు రవాణా వేగవంతం కానుంది. పెట్టుబడులు పెరగడంతో కొత్త ఉపాధి అవకాశాలు కూడా ఏర్పడతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

### ఢిల్లీలో ఆరు లేన్ల సొరంగ మార్గం

ఢిల్లీలో నిర్మించనున్న ఆరు లేన్ల సొరంగ మార్గం ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేను నెల్సన్ మండేలా మార్గ్‌తో అనుసంధానిస్తుంది. దీని ద్వారా ద్వారకా, ఐజీఐ విమానాశ్రయం, వసంత్ కుంజ్, దక్షిణ ఢిల్లీ మధ్య నిరంతర ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుంది. మహిపాల్పూర్ ఎలివేటెడ్ కారిడార్‌తో అనుసంధానం కారణంగా నోయిడా, ఘాజియాబాద్, తూర్పు ఢిల్లీ వైపు రాకపోకలు కూడా సులభమవుతాయి. రూ.6,969.67 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలో లక్షలాది ఉపాధి దినాలను సృష్టిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది.

### యూపీకి గ్రీన్‌ఫీల్డ్ హైవే వరం


ఉత్తరప్రదేశ్‌లో కాన్పూర్‌కబ్రాయ్ మధ్య నిర్మించే 117.7 కిలోమీటర్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు రూ.7,145.14 కోట్లు కేటాయించారు. ఈ మార్గం భోపాల్‌కాన్పూర్ ఆర్థిక కారిడార్‌లో కీలక భాగంగా మారనుంది. జాతీయ రహదారులు, బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌వే, కాన్పూర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం ఏర్పడుతుంది. ప్రస్తుతం మూడున్నర గంటలు పడుతున్న కాన్పూర్‌కబ్రాయ్ ప్రయాణం కేవలం 90 నిమిషాలకు తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల పరిశ్రములు, గనులు, వ్యవసాయ రంగాలకు సరకు రవాణా మరింత వేగవంతం కానుంది.

### ఆర్థికాభివృద్ధికి కొత్త దిశ

నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ ప్రాజెక్టులు కేవలం రహదారుల నిర్మాణంతో ముగిసేవి కావు. మెరుగైన రవాణా సౌకర్యం వల్ల గృహ నిర్మాణ రంగం, గిడ్డంగుల ఏర్పాటు, లాజిస్టిక్స్, రిటైల్, హోటల్ రంగాల్లో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. మెరుగైన అనుసంధానం కారణంగా భూముల విలువలు పెరగడంతో పాటు కొత్త పారిశ్రామిక కేంద్రాలు కూడా ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత దశాబ్దంగా జాతీయ రహదారులపై కేంద్రం భారీగా పెట్టుబడులు పెడుతోంది. రవాణా వ్యయాన్ని తగ్గించడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, కొత్త ఆర్థిక కేంద్రాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టులు ముందుకు తీసుకువెళ్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఢిల్లీఎన్‌సీఆర్‌కు ట్రాఫిక్ సమస్యల నుంచి ఉపశమనం లభించనుండగా, బుందేల్‌ఖండ్ ప్రాంతానికి ఈ హైవే అభివృద్ధి మార్గంగా నిలుస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# వెలుగులోకి రహస్యం

- ముసుగు వీరుడు మొజ్తబా కాదు
- వీడిన ముసుగు మనిషి మిస్టరీ
- ఖమేనీ అంత్యక్రియల సీక్రెట్



ఇరాన్ మాజీ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల సమయంలో అందరి దృష్టిని ఆకర్షించిన ముసుగు ధరించిన వ్యక్తి ఎవరనే ప్రశ్నకు ఎట్టకేలకు సమాధానం లభించింది. అంత్యక్రియల ప్రార్థనల్లో ముందు వరుసలో నల్లటి ఫేస్ మాస్క్, నల్లటి క్యాప్ ధరించి కూర్చున్న వ్యక్తి ఫోటోలు ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయ్యాయి. మొదట అతడే ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీ అని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. భవిష్యత్తు వారసుడిగా భావిస్తున్న మొజ్తబా కావచ్చనే ఊహాగానాలు అంతర్జాతీయ మీడియాలోనూ వినిపించాయి.

### అసలు వ్యక్తి మనవడేనని వెల్లడి

తాజాగా ఇరానియన్ మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం ముసుగు ధరించిన వ్యక్తి మొజ్తబా కాదు. అతడు ఖమేనీ పెద్ద కుమారుడు మొస్తఫా ఖమేనీ కుమారుడు మొహమ్మద్ జవాద్ ఖమేనీ అని గుర్తించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో అతనికి ముఖంపై తీవ్ర కాలిన గాయాలు అయ్యాయని నివేదికలు పేర్కొన్నాయి. ఆ గాయాల కారణంగానే తన ముఖాన్ని పూర్తిగా కప్పుకుని అంత్యక్రియలకు హాజరైనట్లు సమాచారం. దీంతో కొన్ని రోజులుగా కొనసాగుతున్న అనుమానాలకు తెరపడింది.

### మొజ్తబా ఆరోగ్యంపై ఇంకా సందేహాలు

మరోవైపు మొజ్తబా ఖమేనీ ఆరోగ్యంపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. అమెరికా నిఘా వర్గాలను ఉటంకిస్తూ వచ్చిన నివేదికల్లో దాడుల్లో అతనికి తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. అదే సమయంలో ఇరాన్ ప్రతినిధులు కాళ్లు, చేతులకు గాయాలయ్యాయని మాత్రమే వెల్లడించారు. అప్పటి నుంచి మొజ్తబా బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. ప్రసంగాలు కూడా చేయలేదు. సైనికాధికారులు, మత పెద్దలతో చేతిరాత సందేశాల ద్వారానే సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు విదేశీ మీడియా కథనాలు వెల్లడించాయి.

### 4 నెలల తర్వాత అంతిమ సంస్కారాలు

అలీ ఖమేనీ మరణించిన నాలుగు నెలల తర్వాతే ఆయనకు అధికారిక అంత్యక్రియలు నిర్వహించారు. అమెరికా, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల వల్ల భారీ ప్రజా కార్యక్రమం నిర్వహించడం ప్రమాదకరమని ఇరాన్ ప్రభుత్వం భావించింది. అందుకే మృతదేహాన్ని శీతల గిడ్డంగిలో భద్రపరిచి పరిస్థితులు అనుకూలించిన తర్వాత మష్హద్‌లోని ఇమామ్ రెజా పవిత్ర క్షేత్రంలో అంతిమ సంస్కారాలు నిర్వహించింది. ప్రభుత్వ మీడియా అంచనా ప్రకారం దేశవ్యాప్తంగా నిర్వహించిన సంతాప కార్యక్రమాల్లో సుమారు 4.3 కోట్ల మంది పాల్గొన్నట్లు ప్రకటించింది. దీంతో ముసుగు మనిషి చుట్టూ నెలకొన్న మిస్టరీ కూడా అధికారికంగా ముగిసినట్టైంది.

# గెలవలేమని తెలిసి మళ్లీ యుద్ధం

- ఇరాన్‌పై అమెరికా వార్‌తో రగడ
- దాడులతో ఆర్థిక వ్యవస్థల కల్లోలం
- ప్రపంచంతో ట్రంప్ ఆటలు




గెలవలేని యుద్ధాన్ని కొనసాగిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచ దేశాలను పెనం మీద నుంచి పొయ్యిలోకి నెట్టేస్తున్న దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. గెలవడం కష్టమని తెలిసినా అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ట్రంప్ దూకుడు, అమెరికా దాడులు, ఇరాన్ ప్రతీకార చర్యలు మధ్యప్రాచ్యాన్ని మరోసారి అగ్నిగుండంగా మార్చుతున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు ప్రాణాధారమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేస్తున్నట్లు ప్రకటించడంతో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం నెలకొంది. ఒక ప్రాంతీయ ఘర్షణగా మొదలైన ఈ వివాదం ప్రపంచ మార్కెట్లను, ఇంధన ధరలను, దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదిపేసే స్థాయికి చేరుకుంటోంది.

### హర్మూజ్ జలసంధి మూసివేతతో ఉద్రిక్తత

మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ వాతావరణం నెలకొంది. ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గమైన హర్మూజ్ జలసంధిని తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. అనుమతి లేని మార్గంలో ప్రయాణిస్తున్న ఓ నౌకపై హెచ్చరిక కాల్పులు జరిపిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరాన్ విప్లవ గార్డులు వెల్లడించారు. తమ సూచనలను పట్టించుకోకుండా ప్రయాణించిన నౌకలను నిలిపివేసినట్లు ప్రకటించారు. అమెరికా జోక్యం కొనసాగినంత వరకు హర్మూజ్ మార్గంలో వాణిజ్య నౌకలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది.

### అమెరికా 140 లక్ష్యాలపై వైమానిక దాడులు

ఇరాన్ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే అమెరికా భారీ స్థాయిలో ప్రతిదాడి ప్రారంభించింది. ఈ వారంలో మూడోసారి జరిపిన దాడుల్లో మొత్తం 140 లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. క్షిపణి స్థావరాలు, డ్రోన్ కేంద్రాలు, నౌకాదళ సదుపాయాలు, మందుగుండు సామగ్రి గిడ్డంగులు, సమాచార వ్యవస్థలు, తీర ప్రాంత నిఘా కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న సైప్రస్ జెండా కలిగిన కంటైనర్ నౌకపై ఇరాన్ దాడి చేసినందుకే ఈ చర్య తీసుకున్నట్లు అమెరికా పేర్కొంది. ఈ దాడులకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

### గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణుల దాడి

అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ బహ్రెయిన్, ఖతార్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వైపు క్షిపణులు ప్రయోగించినట్లు సమాచారం. యూఏఈ గగనతల రక్షణ వ్యవస్థలు క్షిపణులు, డ్రోన్లను అడ్డుకున్నట్లు ఆ దేశ రక్షణ శాఖ తెలిపింది. బహ్రెయిన్‌లో వైమానిక దాడి హెచ్చరిక సైరన్లు మోగించగా, ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రభుత్వం సూచించింది. ఖతార్‌లో కూడా పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో అప్రమత్త ప్రకటనలు జారీ అయ్యాయి. కువైట్ సైన్యం తమ గగనతలంలోకి వచ్చిన క్షిపణులను అడ్డుకున్నట్లు వెల్లడించింది.

### చమురు మార్కెట్లపై ప్రభావం

ఈ తాజా పరిణామాలు మధ్యప్రాచ్య పరిస్థితులను మరింత ఉద్రిక్తంగా మార్చాయి. గతంలో యుద్ధ విరమణ కోసం కుదిరిన తాత్కాలిక ఒప్పందం ఇప్పటికే బలహీనపడగా, ఇప్పుడు పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. హర్మూజ్ జలసంధి ప్రపంచ చమురు, సహజవాయు రవాణాకు అత్యంత కీలక మార్గం కావడంతో దాని మూసివేత అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. యుద్ధానికి ముందు ఉన్నట్లుగా స్వేచ్ఛాయుత నౌకాయానానికి అనుమతి ఉండదని ఇరాన్ ప్రకటించడం కొత్త ఆందోళనలకు దారితీసింది. మరోవైపు ఈ దాడులు కొనసాగితే మధ్యప్రాచ్య సంక్షోభం మరింత విస్తరించే ప్రమాదం ఉందని అంతర్జాతీయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# అంధత్వ నివారణే లక్ష్యంగా కంటి వైద్య శిబిరం

**చీరాల, జులై 12 (నాదేశం) :** మండలంలోని విజయనగర కాలనీలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. కీ.శే. దుడ్డు మాకయ్య, ముత్యాలమ్మ జ్ఞాపకార్థం గుంటూరు శంకర కంటి ఆసుపత్రి మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థల సంయుక్త సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉసురుపాటి ముసలయ్య ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిబిరానికి ముఖ్య అతిథులుగా ఐటీసీ జనరల్ మేనేజర్ ఎస్.ఎస్. శ్యాం సుందర్, ఐటీసీ సీనియర్ మేనేజర్ వి. శ్రీధర్ హాజరయ్యారు. శంకర కంటి ఆసుపత్రి ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రద్ధా లాజర్, డాక్టర్ హేమసాయి, గ్రామ పెద్ద తేళ్ల లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయనగర కాలనీతో పాటు దాని చుట్టుపక్కల ప్రాంతాలైన ఐక్య నగర్, రామనగర్, ఆదినారాయణపురం, పేరాల తదితర గ్రామాల నుండి ప్రజలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం కంటి శుక్లాలు లేదా ఇతర శస్త్రచికిత్సలు అవసరమైన రోగులను గుర్తించి, వారిని ఉచిత చికిత్సల నిమిత్తం గుంటూరులోని శంకర కంటి ఆసుపత్రికి తీసుకు వెళ్ళి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని వైద్యులు, తెలిపారు. ఈ శిబిరంలో గ్రామ పెద్దలు, యువకులు దుడ్డు వందనం, లోకయ్య, మార్క్, తేళ్ల మోషే, ఒంగోలు యేసు, ఇనగంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యానికి చెక్?




## సుప్రీంకోర్టులో నేడు విచారణ

- విమాన టికెట్ ధరలపై సుప్రీంకోర్టు దృష్టి
- ప్రయాణికులకు ఊరట దొరుకుతుందా?

దేశంలో విమాన టికెట్ ధరల్లో భారీ హెచ్చుతగ్గులపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు జూలై 13న విచారించనుంది. న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ కేసును పరిశీలించనుంది. సామాజిక కార్యకర్త ఎస్. లక్ష్మీనారాయణన్ దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రైవేట్ విమానయాన సంస్థలు టికెట్ ధరలు, అదనపు ఛార్జీలను ఎలాంటి నియంత్రణ లేకుండా నిర్ణయిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని నియంత్రించే స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని, ప్రయాణికుల హక్కులను పరిరక్షించే స్వతంత్ర నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

### ధరల పెరుగుదలపై కోర్టు ఆందోళన

గతంలో ఈ కేసు విచారణ సందర్భంగా కూడా సుప్రీంకోర్టు విమాన టికెట్ ధరలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఒకే రోజు, ఒకే మార్గంలో ప్రయాణించే విమానాలకు ఒక్కో సంస్థ ఒక్కో రకమైన ధరలు వసూలు చేయడాన్ని ప్రశ్నించింది. ముఖ్యంగా పండుగలు, అత్యవసర పరిస్థితులు, వాతావరణ అంతరాయాల సమయంలో టికెట్ ధరలు ఒక్కసారిగా పెరగడాన్ని "ప్రయాణికుల దోపిడీ"గా వ్యాఖ్యానించింది. ధరల్లో కొంత హేతుబద్ధత ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది.

### అదనపు ఛార్జీలపై అభ్యంతరం

పిటిషన్‌లో మరో కీలక అంశాన్ని కూడా ప్రస్తావించారు. గతంలో ఎకానమీ క్లాస్ ప్రయాణికులకు 25 కిలోల వరకు ఉచిత చెక్‌ఇన్ లగేజీ అనుమతించేవారని, ఇప్పుడు దానిని 15 కిలోలకు తగ్గించారని పేర్కొన్నారు. అదనపు బరువుకు భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఒకే బ్యాగ్‌కు మాత్రమే అనుమతి ఇవ్వడం, అదనపు సేవలకు వేర్వేరుగా ఛార్జీలు విధించడం పూర్తిగా ఏకపక్ష నిర్ణయమని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ప్రయోజనం కల్పించకుండా కొత్త ఆదాయ మార్గాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

### కేంద్రం స్పందన

ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే స్పందించింది. 2025 జనవరి నుంచి భారతీయ వాయుయాన అధినియమం 2024 అమల్లోకి వచ్చిందని, దానికి సంబంధించిన నిబంధనలు ప్రస్తుతం సంప్రదింపుల దశలో ఉన్నాయని సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే పిటిషనర్ మాత్రం పాత చట్టాల్లోనే తగిన నిబంధనలు ఉన్నాయని, వాటిని సక్రమంగా అమలు చేయడం లేదని వాదిస్తున్నారు. ప్రస్తుతం విమాన టికెట్ ధరలను సమీక్షించే, పరిమితం చేసే అధికారాలు ఏ సంస్థకూ లేకపోవడంతో విమానయాన సంస్థలు డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెంచుతున్నాయని పేర్కొన్నారు.

### ప్రయాణికుల ఆశలు కోర్టుపైనే

ప్రస్తుతం విమాన ప్రయాణం మధ్యతరగతి ప్రజలకు కూడా సాధారణ అవసరంగా మారింది. అలాంటి సమయంలో ఎలాంటి నియంత్రణ లేకుండా టికెట్ ధరలు పెరగడం, అదనపు ఛార్జీల భారం మోపడం ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తోంది. ప్రత్యేకంగా పండుగలు, అత్యవసర ప్రయాణాలు, ప్రకృతి విపత్తుల సమయంలో టికెట్ ధరలు పలుమార్లు పెరగడం తరచూ విమర్శలకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విచారణపై విమాన ప్రయాణికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ధరల నియంత్రణ, పారదర్శక విధానం, ప్రయాణికుల హక్కుల పరిరక్షణపై కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇస్తుందన్నది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## నాగార్జున యాదవ్ అరెస్ట్‌పై జోగి రమేష్ ఆగ్రహం



వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ అరెస్టును మాజీ మంత్రి జోగి రమేష్ తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్ట్ వెనుక చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఒత్తిడి ఉందని ఆరోపించారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే అక్రమ అరెస్టులు జరుగుతున్నాయని విమర్శించారు. ముఖ్యంగా బీసీ నాయకులను లక్ష్యంగా చేసుకుని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నాగార్జున యాదవ్‌ను ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇంటి నుంచి తీసుకెళ్లడం చట్టవిరుద్ధమని అన్నారు. తెలంగాణ పోలీసులమంటూ వచ్చి అదుపులోకి తీసుకున్నారని కుటుంబ సభ్యులు చెబుతున్నారని గుర్తుచేశారు. స్థానిక పోలీసులకు పూర్తి సమాచారం ఇవ్వకుండా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను అణిచివేసే చర్యలు సరైనవి కావని జోగి రమేష్ పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై ఒత్తిడి తీసుకురావడానికి అధికారాన్ని వినియోగించడం మానుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. నాగార్జున యాదవ్ అరెస్ట్‌పై పూర్తి వివరాలు వెల్లడించాలని, చట్టబద్ధమైన విధానాలను పాటించాలని డిమాండ్ చేశారు.

# పేద విద్యార్థులకు విద్యా చేయూత

- దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ



శ్రీకాకుళం పట్టణ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని బాదుర్లపేట, ఫాజులభేగ్‌పేట ప్రాంతాల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న పేద దేవాంగ విద్యార్థులకు నోట్‌బుక్స్‌తో పాటు ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుంటముక్కల వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి కాశిన సూర్య ప్రసాదరావు, కోశాధికారి తూతిక గణపతిరావు సహా సంఘ ప్రతినిధులు, దాతలు, దేవాంగ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని, విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి సహకరించిన దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# ధవళేశ్వరానికి రైతులు తరలిరండి

- సీఎం పర్యటనకు భారీ ఏర్పాట్లు
- యువనేత నల్లమిల్లి మనోజ్ రెడ్డి పిలుపు



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గేట్ల ప్రారంభోత్సవానికి సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో రైతులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని అనపర్తి యువనేత నల్లమిల్లి మనోజ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు నాలుగు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులతో సమావేశమై కార్యక్రమ విజయవంతానికి అవసరమైన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేసి పాడైన గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేయడం రైతులకు ఎంతో మేలు చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి రైతులు కృతజ్ఞతగా ఘన స్వాగతం పలకాలని కోరారు. సోమవారం ఉదయం 7 గంటలకే అనపర్తి నుంచి బయలుదేరి ధవళేశ్వరం చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. ముఖ్యమంత్రి సభకు భారీ జనసమీకరణ చేపట్టగా, ధవళేశ్వరం పరిసర నియోజకవర్గాల నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యేలా ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అధిష్ఠానం దిశానిర్దేశం చేస్తున్నట్లు సమాచారం.



శేర్లింగంపల్లి నియోజకవర్గంలో, ముఖ్యంగా ఆల్విన్ కాలనీ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తూ, క్షేత్రస్థాయిలో తనదైన ముద్ర వేస్తున్నారు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, నగరంలో మౌలిక వసతుల పరిస్థితి మరియు రాబోయే ఎన్నికలపై ఆయన 'వాయిస్' ఇంటర్వ్యూలో కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజలను భ్రమల్లో ముంచెత్తడం తప్ప క్షేత్రస్థాయిలో సాధించిందేమీ లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. రైతుల వేదికలను వదిలి, హైటెక్ సిటీ శిల్పకళా వేదికలో రైతు భరోసా మీటింగ్‌లు పెట్టడం కేవలం జీహెచ్ఎంసీ, సీఎంసీ ఎన్నికల స్టంట్ అని మండిపడ్డారు.
హైదరాబాద్ వరద ముంపుపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ.. కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడే నగరంలో ఫ్లైఓవర్లు, లింక్ రోడ్లు, నియో పోలీస్ వంటి చారిత్రాత్మక నిర్మాణాలు జరిగాయని గుర్తుచేశారు. నిరుపేదలకు పారదర్శకంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇక నగరంలో సంచలనం సృష్టిస్తున్న 'హైడ్రా' (HYDRA) కేవలం ఒక పొలిటికల్ షో పుటప్ అని, దీనివల్ల హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ పూర్తిగా కుప్పకూలిందని ఆరోపించారు. ఎస్ఐఆర్ (SIR) ఓటర్ల సర్వేపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, గులాబీ జెండాను మళ్ళీ ఎగరేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ 100కు పైగా సీట్లతో అద్భుత విజయం సాధించి, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (CMC) పరిధిలో అధిష్ఠానం ఆదేశాల మేరకు పోటీకి సిద్ధంగా ఉన్నానని, తనదైన మార్క్ రాజకీయం చూపిస్తానని ఈ సందర్భంగా ఎర్రబెల్లి సతీష్ రావు స్పష్టం చేశారు.




# ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా రేవంత్ రూల్

## ఇక చాలు వద్దంటూ కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ సవాల్

**ప్రభాత కిరణమ్ మేనేజింగ్ ఎడిటర్ శ్వేత కె తో, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్ రావు ప్రత్యేక ఇంటర్వ్యూ**





## ముఖాముఖి





**ప్రభుత్వ తీరుతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారా?**

**తిరిగి బీఆర్ఎస్‌ని గెలిపించడానికి ప్రజలు డిసైడయ్యారా?**

**శేరిలింగంపల్లిలో ఈసారి దూసుకుపోయేది కారు పార్టీయేనా?**

**గ్రేటర్‌లో గులాబీ గుబాళింపు మరోసారి ఖాయమేనా?**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, ప్రచారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మారిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. రైతు భరోసా నుంచి హైదరాబాద్ అభివృద్ధి వరకు, కాళేశ్వరం నుంచి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వరకు, హైడ్రా చర్యల నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ వరకు ప్రతి అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలనే ప్రజలు చూస్తున్నారని అన్నారు. శేరిలింగంపల్లి రాజకీయ పరిస్థితులు, ఆల్విన్ కాలనీ సమస్యలు, రాబోయే స్థానిక ఎన్నికలు, తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై తన అభిప్రాయాలను ఆయన స్పష్టంగా వెల్లడించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి పెరుగుతోందని, అదే బీఆర్ఎస్‌కు అతి పెద్ద బలంగా మారుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లిలో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడడం ఖాయమని, రాష్ట్రవ్యాప్తంగా కూడా బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభాత కిరణమ్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అట్లూరి స్వాతితో జరిగిన ఈ ప్రత్యేక ఇంటర్వ్యూలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ఎర్రబెల్లి సతీష్ రావు సూటిగా, స్పష్టంగా తన విమర్శలను వినిపించారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తూ, ముఖ్యంగా ఆల్విన్ కాలనీ డివిజన్‌లో పార్టీ కార్యకలాపాలకు చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్ రావు ప్రస్తుత రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, హైదరాబాద్ అభివృద్ధి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కాళేశ్వరం, శేరిలింగంపల్లి రాజకీయాలు, ఎస్ఐఆర్ ప్రక్రియ వంటి పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

**ప్రశ్న: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఈ ప్రభుత్వ పనితీరును మీరు ఎలా చూస్తున్నారు?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. రైతు భరోసా వంటి రైతులకు సంబంధించిన కార్యక్రమాన్ని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో నిర్వహించాల్సింది పోయి శిల్పకళా వేదికలో నిర్వహించడం వెనుక రాజకీయ ఉద్దేశాలే కనిపిస్తున్నాయి. రైతుల సమస్యలకు సంబంధం లేని వేదికలో సభ పెట్టి ప్రభుత్వం పనిచేస్తోందనే భావన కల్పించే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నగర ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నమే తప్ప, గ్రామీణ స్థాయిలో రైతులకు న్యాయం జరిగిందనే పరిస్థితి కనిపించడం లేదన్నారు.

**ప్రశ్న: హైదరాబాద్‌లో వర్షాలు పడితే నగరం మునిగిపోతోందని, బీఆర్ఎస్ హయాంలో విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. దీనిపై మీ సమాధానం?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** అది పూర్తిగా రాజకీయ ఆరోపణ మాత్రమే. బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు భారీ మౌలిక సదుపాయాలు కల్పించింది. ఫ్లైఓవర్లు, లింక్ రోడ్లు, ఐటీ కారిడార్లు, హై రైజ్ భవనాల అభివృద్ధి అన్నీ కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే జరిగాయి. నియోపోలిస్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే శ్రీకారం చుట్టింది. ఇప్పుడు ఆ ప్రాజెక్టుల వల్ల వస్తున్న ఆదాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకోవడం సరికాదు. మేము వేసిన పునాదులపైనే వారు ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు.

**ప్రశ్న: కానీ వర్షాలు వస్తే హైదరాబాద్‌లో డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా నిపిస్తున్నాయి. దీనికి బీఆర్ఎస్ బాధ్యత లేదని చెప్పగలరా?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయింది. ఇప్పటికీ ప్రతి సమస్యకు గత ప్రభుత్వాన్నే కారణంగా చూపడం సమంజసం కాదు. ప్రజలు ఇప్పుడు ప్రస్తుత ప్రభుత్వాన్ని చూస్తున్నారు. అధికార యంత్రాంగం మొత్తం వారి చేతుల్లోనే ఉంది. సమస్యలు కనిపిస్తే పరిష్కరించే బాధ్యత కూడా వారిదే. ప్రతిసారి పాత ప్రభుత్వాన్ని నిందించడం వల్ల ప్రజలకు ఉపయోగం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు.

**ప్రశ్న: అడ్డగోలు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం వల్లే నగర సమస్యలు పెరిగాయని విమర్శలు వస్తున్నాయి. దీనిపై మీ స్పందన?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** బీఆర్ఎస్ పాలనలో ప్రతి నిర్ణయం వ్యవస్థబద్ధంగా జరిగేది. ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులు కలిసి సమీక్షలు నిర్వహించి నిర్ణయాలు తీసుకునేవారు. ప్రస్తుతం ఆ విధమైన సమన్వయం కనిపించడం లేదు. అందుకే పరిపాలనలో గందరగోళం నెలకొంది. పాలనలో లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాల్సింది ప్రస్తుత ప్రభుత్వమేనని అన్నారు.

**ప్రశ్న: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించినా పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదనే విమర్శ ఉంది. ఎందుకు?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో పారదర్శకతకు పెద్దపీట వేసింది. దరఖాస్తు చేసిన వారిలో అర్హులను ఎంపిక చేయడానికి డ్రా విధానాన్ని అనుసరించింది. ఇందులో రాజకీయ సిఫార్సులకు అవకాశం ఇవ్వలేదు. నిజమైన లబ్ధిదారులకే ఇళ్లు అందేలా కలెక్టర్లకు పూర్తి అధికారాలు ఇచ్చింది. చాలా మందికి ప్రభుత్వమే నేరుగా ఫోన్ చేసి ఇళ్లు కేటాయించినట్లు సమాచారం ఇచ్చింది. ఎన్నికల సమయం దగ్గర పడటం, ప్రభుత్వం మారడం వంటి కారణాలతో కొంత ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఇళ్లలో ఎక్కువ భాగం బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించినవేనని పేర్కొన్నారు.

**ప్రశ్న: కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కాకుండా జీతం తీసుకుంటున్నారని, కుటుంబ సభ్యుడికి గాయం అవగానే బయటకు వచ్చారని కాంగ్రెస్ విమర్శిస్తోంది. దీనిపై ఏమంటారు?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** కేసీఆర్‌పై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు రాజకీయ పరమైనవే. అసెంబ్లీలో పార్టీ తరఫున కేటీఆర్, హరీశ్ రావు సమర్థంగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ రావాల్సిన అవసరం వచ్చినప్పుడు తప్పకుండా వస్తారు. ఆయనను ఎవరు అడ్డుకోలేరు. కుటుంబ సభ్యుడిని ఆసుపత్రిలో పరామర్శించడాన్ని కూడా రాజకీయంగా విమర్శించడం కాంగ్రెస్ సంస్కృతిని చూపిస్తోందన్నారు.

**ప్రశ్న: కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం సరిగా వినియోగించుకోవడం లేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. మీ అభిప్రాయం?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిస్థాయిలో వినియోగించడం లేదు. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావు, జగదీష్ రెడ్డి తదితరులు రైతుల వద్దకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. అవసరమైతే కొద్ది రోజులు ప్రాజెక్టును తమకు అప్పగిస్తే పంపింగ్ ఎలా చేయాలో చూపిస్తామని కూడా చెప్పారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు నీరు అందించడంపైనే ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

**ప్రశ్న: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరిన తర్వాత బీఆర్ఎస్ పరిస్థితి ఎలా ఉంది?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** ఎమ్మెల్యే పార్టీని విడిచిపెట్టడం వల్ల కార్యకర్తలు నిరాశ చెందారు. కానీ పార్టీ బలహీనపడలేదు. శేరిలింగంపల్లి ఇన్‌చార్జిగా ఉన్న ఎమ్మెల్యే అరికెపూడి కృష్ణారావు పార్టీని సమర్థంగా ముందుకు తీసుకెళ్తున్నారు. గత రెండున్నరేళ్లలో ఆయన అనేక మంది కొత్త నాయకులను తయారు చేశారు. కార్యకర్తలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఏ పని ఉన్నా సహాయం చేస్తున్నారు. ఆయన నాయకత్వంలో శేరిలింగంపల్లిలో మళ్లీ బీఆర్ఎస్ బలపడిందని, రాబోయే స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

**ప్రశ్న: ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రజలకు మీరు ఏమి సూచిస్తున్నారు?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలి. ప్రస్తుతం చాలామందికి అవగాహన లేకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కాలనీల్లో ప్రచారం చేస్తున్నాం. ప్రజలు ఎక్కడ నివసిస్తున్నారో అక్కడే ఓటును నమోదు చేసుకోవాలి. భవిష్యత్తులో ఓటు, ఆధార్, చిరునామా వంటి వివరాలు పరస్పరం అనుసంధానం అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ పథకాల అర్హత విషయంలో కూడా ఇవి కీలకంగా మారవచ్చు. అందుకే ఓటు నమోదును నిర్లక్ష్యం చేయవద్దని ప్రజలకు సూచిస్తున్నాం. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రభుత్వం సరైన స్థాయిలో ప్రచారం చేయలేదని, ప్రజల్లో ఇంకా అవగాహన తక్కువగా ఉందని ఆయన అన్నారు. ఫారమ్‌లు ఎలా నింపాలి, ఎక్కడ సమర్పించాలి అనే విషయాల్లో గందరగోళం ఉందన్నారు. అందుకే ప్రక్రియకు మరింత గడువు ఇవ్వాలని బీఆర్ఎస్ అధిష్ఠానం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరిందని తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు పార్టీ కార్యకర్తలంతా ఇతర కార్యక్రమాలను పక్కనపెట్టి ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపైనే దృష్టి పెట్టాలని పార్టీ ఆదేశించిందని చెప్పారు.

**ప్రశ్న: ఎస్ఐఆర్ ప్రక్రియలో లక్షలాది ఓట్లు తొలగిపోతాయనే ప్రచారం జరుగుతోంది. ఈ ప్రక్రియ వల్ల ఏ పార్టీకి ఎక్కువ నష్టం లేదా లాభం జరుగుతుందని మీరు భావిస్తున్నారు? బీఆర్ఎస్‌కు ప్రయోజనం ఉంటుందా? కాంగ్రెస్‌కా? లేక బీజేపీకా?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** ఎస్ఐఆర్ ప్రక్రియను రాజకీయ కోణంలో కాకుండా ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చే ప్రక్రియగా చూడాలి. గతంలో హైదరాబాద్‌లో పోలింగ్ శాతం 40 నుంచి 50 శాతం మధ్యే ఉండేది. ఓటరు జాబితా శుద్ధి పూర్తయితే డూప్లికేట్ ఓట్లు తొలగిపోతాయి. వాస్తవంగా ఓటు హక్కు ఉన్నవారే ఓటు వేయగలుగుతారు. దీంతో పోలింగ్ శాతం కూడా 70 నుంచి 80 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని నేను భావిస్తున్నాను. ఈ ప్రక్రియ వల్ల బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి నష్టం ఉండదని నా అభిప్రాయం. స్థానికంగా నివసిస్తూ తెలంగాణ అభివృద్ధిని కోరుకునే ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలుస్తారని విశ్వసిస్తున్నాం. అందువల్ల శుద్ధి చేసిన ఓటరు జాబితా చివరికి బీఆర్ఎస్‌కు అనుకూలంగానే మారుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. (7లో..)








**ప్రశ్న: ఆల్విన్ కాలనీ డివిజన్‌లో మీరు నిరంతరం ప్రజల్లో ఉంటున్నారు. అక్కడ ప్రధానంగా ఏ సమస్యలు ఉన్నాయని భావిస్తున్నారు? రాబోయే స్థానిక ఎన్నికల్లో వాటిని ఎలా ప్రజల ముందుకు తీసుకెళ్తారు?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** ఆల్విన్ కాలనీ డివిజన్‌లో అనేక మౌలిక సదుపాయాల సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. ఎల్లమ్మ చెరువు పరిసర రహదారులు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి పనులు ప్రారంభమైనా పూర్తి కాలేదు. విజయనగర్ కాలనీ, మాధవీనగర్, తులసీనగర్, తులసీవనం వంటి కాలనీల ప్రజలు చాలాకాలంగా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా ఆశించిన పురోగతి కనిపించడం లేదన్నారు. బ్రాహ్మణి కుంట, అంబీర్ చెరువు, పర్కి చెరువు వంటి నీటి వనరుల అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆయన ఆరోపించారు. ఆక్రమణలు లేని చెరువులను కూడా అభివృద్ధి చేయకుండా ప్రభుత్వం వదిలేసిందని, హైడ్రా చర్యలు ఎంపిక చేసిన ప్రాంతాలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. అదే విధంగా ఆల్విన్ కాలనీ పరిధిలో దాదాపు ప్రతి వీధిలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. పైప్‌లైన్లు పాతబడిపోయినా గత రెండున్నరేళ్లలో ప్రభుత్వం వాటిని మార్చలేదని, రహదారుల నిర్వహణ కూడా నిర్లక్ష్యంగా మారిందన్నారు. రోడ్ల విస్తరణ పనుల్లో కూడా ప్రణాళిక లోపించిందని ఆయన అభిప్రాయపడ్డారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలను వదిలిపెట్టి మధ్య మధ్యలో పనులు చేపడుతున్నారని, ప్రజల అవసరాల కంటే ఇతర ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

**ప్రశ్న: హైడ్రా ప్రారంభంలో విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ ఇప్పుడు ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరుగుతోందనే ప్రచారం ఉంది. దీనిపై మీ అభిప్రాయం?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** హైడ్రా పని తీరుపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారం కంటే వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. నిజంగా అభివృద్ధి అవసరమైన ప్రాంతాలను పక్కనపెట్టి, రాజకీయంగా ప్రచారం వచ్చే ప్రాంతాల్లో మాత్రమే చర్యలు తీసుకుంటున్నారనే భావన ప్రజల్లో ఉంది. బ్రాహ్మణి కుంట, అంబీర్ చెరువు, పర్కి చెరువు, ఎల్లమ్మ చెరువు వంటి ప్రాంతాల్లో అవసరమైన పనులు జరగకపోవడం ఇందుకు ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. హైడ్రా చర్యల వల్ల రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతిందని, హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రజలు వెనుకాడుతున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ జిల్లాల నుంచి కూడా చాలామంది పెట్టుబడిదారులు హైదరాబాద్‌లో స్థలాలు కొనడానికి ఆసక్తి చూపడం తగ్గిందని, దీనివల్ల మార్కెట్ మందగించిందని ఆయన ఆరోపించారు. స్థలాల అమ్మకాలు తగ్గడం వల్ల రైతులు, చిన్న పెట్టుబడిదారులు, ఇళ్లు నిర్మించుకోవాలనుకునే మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**ప్రశ్న: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉంటుందా? లేక బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారా?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** ముఖ్యమంత్రి పదవిపై చాలా మంది నాయకులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తుంటారు. కానీ చివరికి నిర్ణయం తీసుకునేది ప్రజలే. తెలంగాణలో బీజేపీకి పరిమిత స్థాయిలో మాత్రమే కేడర్ ఉందని, అది ఎన్నికల ఫలితాలను నిర్ణయించే స్థాయిలో లేదని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ బలంగా తిరిగి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ద్విముఖ పోటీ జరిగినా, త్రిముఖ పోటీ జరిగినా బీఆర్ఎస్ మొదటి స్థానంలో నిలుస్తుందని, దాదాపు 100 స్థానాలకు చేరువలో విజయం సాధించి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.





# ముఖాముఖి





**ప్రశ్న: గత ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు కనిపిస్తున్నాయి. కొన్ని విమర్శలు కూడా వస్తున్నాయి. ఇవి పార్టీపై ప్రభావం చూపవా?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** ప్రతి రాజకీయ పార్టీలో అభిప్రాయ భేదాలు సహజం. కానీ వాటిని అతిశయోక్తిగా చూపించే ప్రయత్నం జరుగుతోంది. ప్రజలు వ్యక్తిగత వివాదాల కంటే తమకు జరిగిన అభివృద్ధినే గుర్తుంచుకుంటారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల మదిలో ఇంకా ఉన్నాయని ఆయన అన్నారు. అంతర్గత రాజకీయాలతో బీఆర్ఎస్ బలహీనపడుతుందనే ప్రచారాన్ని ప్రజలు నమ్మరని, ఎన్నికల్లో దానికి సమాధానం చెబుతారని పేర్కొన్నారు.

**ప్రశ్న: బీఆర్ఎస్ హయాంలోనే ఆల్విన్ కాలనీలో కార్పొరేటర్ మీ పార్టీకే చెందిన వారు ఉన్నారు. అప్పుడే అన్ని సమస్యలు ఎందుకు పరిష్కరించలేకపోయారు?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం చాలా తక్కువ కాలంలో అనేక చారిత్రక కార్యక్రమాలు చేపట్టింది. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించడం, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, ఫ్లైఓవర్లు, కొత్త జిల్లాల ఏర్పాటు, ఐటీ విస్తరణ వంటి భారీ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాల్సి వచ్చింది. ఆల్విన్ కాలనీలో కూడా రహదారులు, మౌలిక సదుపాయాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు వంటి అనేక పనులు జరిగాయని తెలిపారు. అయితే నగరం వేగంగా విస్తరించడంతో జనాభా పెరిగింది. అపార్ట్‌మెంట్లు, భవనాలు పెరగడంతో డ్రైనేజీపై ఒత్తిడి కూడా పెరిగిందన్నారు. ఈ మార్పులకు అనుగుణంగా పైప్‌లైన్లను నవీకరించడం ప్రస్తుత ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

**ప్రశ్న: కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దఎత్తున కొత్త రేషన్ కార్డులు జారీ చేసింది. దీనిని ప్రజలు సానుకూలంగా చూస్తున్నారు. దీనిపై మీ సమాధానం ఏమిటి?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే లక్షలాది రేషన్ కార్డులు మంజూరు చేసింది. అయితే చేసిన పనులను ప్రచారం చేసుకోవడంలో మేము వెనుకబడ్డాం. కాళేశ్వరం, మిషన్ భగీరథ, రైతుబంధు వంటి పథకాలను ప్రచార హంగులు లేకుండానే అమలు చేశాం.
ప్రస్తుతం ప్రభుత్వం చిన్న కార్యక్రమాన్నీ పెద్ద ప్రచారంగా మార్చుకుంటోందని ఆయన విమర్శించారు. రైతు భరోసా వంటి కార్యక్రమాలను రైతుల మధ్య నిర్వహించాల్సింది పోయి నగర వేదికల్లో సభలు నిర్వహించడం ద్వారా ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు.

**ప్రశ్న: రాబోయే జీహెచ్ఎంసీ లేదా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మీరు ప్రత్యక్షంగా పోటీ చేసే ఆలోచన ఉందా?**

**ఎర్రబెల్లి సతీష్ రావు:** పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే నాకు ముఖ్యం. మా ఇన్‌చార్జి ఎమ్మెల్యే అరికెపూడి కృష్ణారావు సూచనల మేరకు పార్టీ ఏ బాధ్యత అప్పగించినా నిర్వర్తిస్తాను. ఏ డివిజన్‌లో పని చేయమన్నా చేస్తాను. పోటీ చేయమంటే పోటీ చేస్తాను. పార్టీ విజయం కోసం అవసరమైన ప్రతి స్థాయిలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాను. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడితే అక్కడ కూడా బీఆర్ఎస్ బలోపేతానికి తనవంతు పాత్ర పోషిస్తానని, భవిష్యత్ స్థానిక ఎన్నికల్లో తన రాజకీయ ముద్ర స్పష్టంగా కనిపిస్తుందని ఎర్రబెల్లి సతీష్ రావు ధీమా వ్యక్తం చేశారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిరాశపరుస్తోందని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే ప్రస్తుతం తెలంగాణకు బలమైన పునాదిగా ఉన్నాయని ఎర్రబెల్లి సతీష్ రావు పేర్కొన్నారు. శేరిలింగంపల్లిలో పార్టీ మరింత బలపడుతోందని, కార్యకర్తల విశ్వాసంతో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయాన్ని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రభుత్వంపై సూటిగా.. స్పష్టంగా ఆరోపణలు.. ప్రజా గళం.. ఎర్రబెల్లి సతీష్ రావు గళం..

"రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేయడం, ప్రచారం చేసుకోవడం తప్ప ప్రజలకు ఉపయోగపడే ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేకపోయింది."

"రైతు భరోసా రైతుల మధ్య ప్రకటించాల్సింది పోయి శిల్పకళా వేదికలో సభ పెట్టడం రైతుల కోసం కాదు.. రాజకీయ ప్రచారం కోసం మాత్రమే."

- **"హైదరాబాద్‌లో ఏ అభివృద్ధి కనిపించినా అది బీఆర్ఎస్ హయాంలో వేసిన పునాదే.. ఇప్పుడు ఆ పనులపై కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది."**
- **"రెండున్నరేళ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం ఇప్పటికీ ప్రతి సమస్యకు బీఆర్ఎస్‌ను నిందించడం చేతకానితనానికి నిదర్శనం."**
- **"కాళేశ్వరం ప్రాజెక్టును సక్రమంగా వినియోగించక రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ, వైఫల్యాన్ని దాచుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోంది."**
- **"హైడ్రా పేరుతో ప్రజలను భయపెట్టి, రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేసి, హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టే వాతావరణాన్నే ప్రభుత్వం దెబ్బతీసింది."**
- **"ఆల్విన్ కాలనీలో డ్రైనేజీ, చెరువుల అభివృద్ధి, రోడ్ల విస్తరణ వంటి ప్రాథమిక సమస్యలను రెండున్నరేళ్లుగా పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది."**
- **"ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు సరైన అవగాహన కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.. గందరగోళం సృష్టించి ప్రజలను అయోమయానికి గురిచేసింది."**
- **"శేరిలింగంపల్లిలో ఎమ్మెల్యే పార్టీ మారినా బీఆర్ఎస్ బలహీనపడలేదు.. కార్యకర్తల బలంతో వచ్చే ఎన్నికల్లో గులాబీ జెండా మళ్లీ ఎగరడం ఖాయం."**
- **"తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పాలనపై విసిగిపోయారు.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు భారీ మెజారిటీ ఇచ్చి కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా తీసుకురావడం ఖాయమని నాకు పూర్తి నమ్మకం ఉంది."**









# వరుస ఓటములతో జట్టులో మార్పులు

**• ఇంగ్లండ్, జింబాబ్వే సిరీస్‌లకు కొత్త ముఖాలు**
**• గాయాల షాక్‌తో టీమిండియాలో మార్పులు**



ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్, జింబాబ్వేతో టీ20 సిరీస్‌లకు ముందు భారత జట్టుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఇద్దరు కీలక బౌలర్లు గాయపడటంతో, బీసీసీఐ జట్టులో చివరి నిమిషంలో మార్పులు చేసింది. ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో హర్షిత్ రాణాకు కుడి తొడ కండరంలో గ్రేడ్ 1 హ్యామ్‌స్ట్రింగ్ గాయం కాగా, వరుణ్ చక్రవర్తికి ఎడమ హ్యామ్‌స్ట్రింగ్‌లో గ్రేడ్ 2 గాయం నిర్ధారణ అయింది. దీంతో హర్షిత్ ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు, వరుణ్ జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు దూరమయ్యారు. ఇద్దరూ చికిత్స, పునరావాసం కోసం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు వెళ్లనున్నారు.

### ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్‌కు అవకాశం

గాయపడిన హర్షిత్ రాణా స్థానంలో యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను వన్డే జట్టులోకి ఎంపిక చేశారు. ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆకట్టుకున్న ప్రిన్స్, ఇటీవల ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో కూడా తన బౌలింగ్‌తో సెలెక్టర్లను మెప్పించాడు. మరోవైపు వరుణ్ చక్రవర్తి స్థానంలో అనుభవజ్ఞుడైన లెగ్‌స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను జింబాబ్వే టీ20 జట్టులోకి తీసుకున్నారు. ఇప్పటికే టీ20 ప్రపంచకప్ అనంతరం వరుస గాయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వరుణ్‌కు ఇది మరో ఎదురుదెబ్బగా మారింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని వన్డే జట్టు, శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీ20 జట్టు సిరీస్‌లలో విజయాలపై దృష్టి పెట్టాయి.

# శ్రేయస్ అయ్యర్‌కు అండగా నిలిచిన నయర్

### ఓటములతో నాయకత్వాన్ని అంచనా వేయొద్దు



ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో ఘోర పరాజయం తర్వాత భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ మాజీ క్రికెటర్ అభిషేక్ నయర్ ఆయనకు మద్దతుగా నిలిచారు. కొత్త కెప్టెన్‌కు తనదైన జట్టును నిర్మించుకునే స్వేచ్ఛ, సమయం ఇవ్వాలని సూచించారు. తొలి సిరీస్‌ల ఫలితాల ఆధారంగా నాయకత్వాన్ని ప్రశ్నించడం సరైంది కాదన్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్ కూడా ఆరంభంలో సవాళ్లు ఎదుర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇంగ్లండ్ జట్టు షార్ట్ బాల్స్‌తో భారత బ్యాటర్ల బలహీనతను పూర్తిగా బయటపెట్టిందని నయర్ అభిప్రాయపడ్డారు. ఈ ఓటమి భవిష్యత్తుకు మంచి పాఠమని, ప్రపంచకప్ నాటికి భారత్ మరింత బలమైన జట్టుగా మారే అవకాశం ఉందన్నారు. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని జట్టు యాజమాన్యం తరచూ మార్పులు చేయకుండా ఆటగాళ్లకు స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వాలని సూచించారు. అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి వంటి బౌలర్లపై నమ్మకం ఉంచి వారికి మెరుగుపడే అవకాశం కల్పించాలని, ఓటమి తర్వాత గందరగోళం కాదు.. స్పష్టమైన ప్రణాళిక అవసరమని నయర్ వ్యాఖ్యానించారు.

# ఇండియా వరుస పరాజయాలు..



**■ గంభీర్ బృందంలో సమూల మార్పులు**
**■ కోచ్‌ల భవితవ్యంపై ఉత్కంఠ?**
**■ ఉద్వాసన లిస్టు రెడీ చేసిన బీసీసీఐ**

ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో 40 తేడాతో ఓటమి, అంతకుముందు ఐర్లాండ్ చేతిలో సిరీస్ పరాజయం తర్వాత టీమిండియా కోచింగ్ బృందంపై ఒత్తిడి పెరిగింది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని జట్టు నిర్వహణపై బీసీసీఐ సమీక్ష ప్రారంభించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోషేట్, బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ తమ ఒప్పందాలు ముగిసిన తర్వాత కొనసాగాలా వద్దా అనే అంశంపై ఆలోచిస్తున్నట్లు సమాచారం. టెన్ డోషేట్ ఏడాది పొడవునా జట్టుతో ప్రయాణించడం కష్టంగా ఉందని బీసీసీఐకి తెలిపినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సహాయక సిబ్బందిలోని ఒక ప్రముఖ సభ్యుడు అంతర్జాతీయ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓ ఐపీఎల్ ఫ్రాంచైజీతో చర్చలు జరుపుతున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఫీల్డింగ్ ప్రమాణాలు పడిపోవడంతో ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ భవితవ్యంపైనా అనిశ్చితి నెలకొంది. పరిస్థితులు మారకపోతే బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫాస్ట్ బౌలింగ్ కోచ్ లక్ష్మీపతి బాలాజీకి కీలక బాధ్యతలు అప్పగించే అవకాశమున్నట్లు సమాచారం. అయితే ఈ మార్పులు కేవలం తాజా ఓటముల కారణంగా కాదని, కోచింగ్ వ్యవస్థలో సహజ పునర్వ్యవస్థీకరణలో భాగమేనని నివేదికలు పేర్కొంటున్నాయి. గంభీర్ నేతృత్వంలో భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ 2025, టీ20 ప్రపంచకప్ 2026 గెలిచినా, ఇటీవల ఎదురైన వరుస వైఫల్యాలతో కోచింగ్ బృందం ఇప్పుడు తీవ్ర పరిశీలనను ఎదుర్కొంటోంది.

# వైభవ్‌ను తప్పించింది ఫామ్ వల్ల కాదు

**◆ వ్యూహం కోసమేనన్న కెప్టెన్ శ్రేయస్ అయ్యర్**
**◆ ఓపెనింగ్ కాంబినేషన్ కోసం కీలక నిర్ణయం**



ఇంగ్లండ్‌తో ఐదో టీ20 మ్యాచ్‌లో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీని జట్టు నుంచి తప్పించడంపై కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ స్పష్టత ఇచ్చారు. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైనందుకే అతడిని పక్కన పెట్టలేదని, జట్టు వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఇంగ్లండ్ పరిస్థితులకు అనుగుణంగా ఎడమచేతి-కుడిచేతి ఓపెనింగ్ జోడీ అవసరమని భావించి, అభిషేక్ శర్మతో కలిసి అనుభవజ్ఞుడు సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా పంపినట్లు తెలిపారు. ఇంగ్లండ్ పర్యటనలో భారత్ అన్ని విభాగాల్లోనూ వెనుకబడిందని శ్రేయస్ అంగీకరించారు. ప్రతి వేదికలో భిన్నమైన పరిస్థితులకు త్వరగా అలవాటు పడలేకపోవడం ఓటములకు ప్రధాన కారణమన్నారు. అయితే ఈ సిరీస్ తమకు విలువైన పాఠాలు నేర్పిందని, భవిష్యత్ విదేశీ పర్యటనలు, ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని మరింత మెరుగైన ప్రణాళికతో ముందుకు వెళ్తామని చెప్పారు. మంచి, చెడు ఫలితాలు ఆటలో భాగమేనని, ఒత్తిడిని అవకాశంగా మార్చుకుని జట్టును మరింత బలంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని శ్రేయస్ అయ్యర్ స్పష్టం చేశారు.

# వింబుల్డన్ మళ్లీ సిన్నర్ సొంతం

**• వరుసగా రెండో టైటిల్**
**•జ్వెరెవ్‌పై నాలుగు సెట్ల విజయం**

లండన్: వింబుల్డన్ 2026 పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఇటలీ స్టార్ జానిక్ సిన్నర్ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను 67, 76, 63, 64 తేడాతో ఓడించి వరుసగా రెండోసారి వింబుల్డన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. దాదాపు నాలుగు సెట్ల పాటు ఉత్కంఠగా సాగిన ఈ పోరులో సిన్నర్ అద్భుతమైన ఆత్మవిశ్వాసం, పట్టుదలతో విజేతగా నిలిచాడు. మ్యాచ్ ప్రారంభం నుంచే ఇద్దరూ సమానంగా పోటీపడ్డారు. తొలి సెట్ టైబ్రేక్‌కు వెళ్లగా జ్వెరెవ్ 97తో గెలిచి ఆధిక్యంలోకి వెళ్లాడు. అయితే రెండో సెట్‌లో సిన్నర్ అద్భుతంగా పుంజుకుని టైబ్రేక్‌ను 72తో సొంతం చేసుకుని మ్యాచ్‌ను సమం చేశాడు. మూడో సెట్‌లో జ్వెరెవ్ మోకాలి అసౌకర్యంతో ఇబ్బంది పడగా, ఆ అవకాశాన్ని సిన్నర్ చక్కగా వినియోగించుకున్నాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి 63తో సెట్‌ను గెలుచుకుని పూర్తి ఆధిపత్యం సాధించాడు. నాలుగో సెట్‌లో కూడా సిన్నర్ తన దూకుడును కొనసాగించాడు. మరోసారి జ్వెరెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 64తో సెట్‌ను గెలిచి వింబుల్డన్ కిరీటాన్ని విజయవంతంగా నిలబెట్టుకున్నాడు.




# 24న రామాయణ ట్రైలర్ విడుదల

భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఇదీ ఒకటి. ఈ మూవీలో రాముడిగా బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించింది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. కొన్ని వేల సంవత్సరాలుగా ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ అనే ఆదర్శాలతో 'రామాయణం' ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చింది. మన నాగరికతకు అద్దం పట్టే ఈ గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేయబోతున్నాం అని ఇన్‌స్టాలో చిత్రబృందం పోస్ట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవితో పాటు పలువురు అగ్ర తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్ తో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు.


# మురుగన్ నేపథ్యంలో చిత్రాల నిర్మాణం

### తెలుగు, తమిళంలో కార్తికేయుడి నేపథ్యంలో సినిమాలు



దక్షిణాది సినీ పరిశ్రమలో దైవిక, పురాణ గాథల నేపథ్యానికి నయా క్రేజ్ మొదలైంది. ఒకప్పుడు పౌరాణిక కథలకు కేరాఫ్ అడ్రస్‌గా కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలు మళ్లీ అదే బాట పట్టినట్లు తెలుస్తున్నాయి. ప్రస్తుతం తమిళ, తెలుగు సినీ రంగాలలో లార్డ్ మురుగన్ (సుబ్రమణ్య స్వామి) కాన్సెప్ట్ ఒకవైపు భారీ ట్రెండ్‌గా మారుతోంది. టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖ దర్శకులు, అగ్ర హీరోలు మురుగన్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రతిష్ఠాత్మక చిత్రాలను ప్రకటించడం సోషల్ మీడియా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ట్రెండ్‌ను మొదటిగా కోలీవుడ్ హీరో శివకార్తికేయన్ ప్రారంభించాడు అని చెప్పవచ్చు. శివకార్తికేయన్ పుట్టినరోజు పురస్కరించుకుని విడుదలైన ఒక గ్లింప్స్ ఇటీవలే అందరి దృష్టిని ఆకర్షించింది. శివకార్తికేయన్ ప్రధాన పాత్రలో లోకనాయకుడు కమల్ హాసన్ భారీ నిర్మాణంలో, శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'సేయోన' అనే చిత్రం ఈ మురుగన్ సెంటిమెంట్‌కు పునాది వేసింది. తమిళ ప్రాచీన సంస్కృతి, సాహిత్యంలో కార్తికేయుడిని 'సేయోన' అని పిలుస్తారు. ఈ చిత్ర గ్లింప్స్‌లో శివకార్తికేయన్ విరుమాండి స్వామి పూనకం వచ్చినట్లుగా, అత్యంత ఊరమాస్ లుక్‌లో పల్లెటూరి జాతర నేపథ్యంలో కనిపించి అభిమానులను అలరించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ యాక్షన్ డ్రామాను అక్టోబర్ లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ మరియు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ అనౌన్స్ అయింది. ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార' అనే టైటిల్ విస్తృతంగా ప్రచారంలో ఉంది. దీంతో ఈ ప్రాజెక్ట్ కూడా మురుగన్

# భాగ్యశ్రీ బోర్సే భావోద్వేగం




'లెనిన్'లో అఖిల్‌కు జోడీగా భారతి పాత్రలో నటించి ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడిందని ఆమె తెలిపారు. తాజాగా ఈ చిత్రం సక్సెస్‌మీట్ లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. తన అభిమానులు తనను నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉన్నారని ఈ చిత్రబృందంతో పాటు వాళ్లందరి వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. హైదరాబాద్ తనకు కర్మభూమి అని చెప్పారు.

### తండ్రిని హత్తుకున్న అఖిల్

అఖిల్ మూవీ హిట్ అయితే చూడాలని ఆశగా ఎదురుచూసిన అక్కినేని అభిమానుల కల నెరవేరింది. ఆయన కథానాయకుడిగా మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందిన రూరల్ యాక్షన్ డ్రామా 'లెనిన్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ముఖ్యంగా అఖిల్ నటన, ద్వితీయార్ధంలో వచ్చే ట్విస్ట్‌లు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ఈ సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ సక్సెస్ సెలబ్రేషన్స్ జరిగాయి. చిత్ర బృందం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంది. ఈ సందర్భంగా తండ్రి నాగార్జున పాదాలకు నమస్కరించిన అఖిల్.. ఆయన్ను గట్టిగా హత్తుకుని భావోద్వేగానికి గురయ్యారు.

# అఖిల్‌కు హిట్ ఇమ్మని శ్రీవారిని కోరుకున్నా

### లెనిన్ సక్సెస్ మీట్‌లో నాగార్జున



తిరుమల శ్రీవారి దర్శనానికి ఎప్పుడెళ్లినా తాను ఏం కోరుకోనని.. కానీ, ఇటీవల వెళ్లినప్పుడు మాత్రం అఖిల్‌కు మంచి హిట్ ఇవ్వమని కోరుకున్నట్లు నాగార్జున తెలిపారు. అఖిల్ హీరోగా మురళీ కిషోర్ అబ్బూరి తెరకెక్కించిన 'లెనిన్' తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ.. అఖిల్‌కు విజయాన్ని ఇవ్వాలనే ఏకైక లక్ష్యంతో టీమ్ అంతా కలిసి కట్టుగా వర్క్ చేసిందన్నారు. సినిమాకు అడగ్గానే వాయిస్ ఓవర్ ఇచ్చిన మా పెద్దబ్బాయ్ తారక్‌కు ధన్యవాదాలు. సరిగ్గా ఏడాది క్రితం 'తండేల్' సక్సెస్‌మీట్‌కు వచ్చాను. ఇప్పుడు 'లెనిన్' ఈవెంట్.. నాగచైతన్య, అఖిల్ ఇద్దరూ నాకు రెండు కళ్లు. 'లెనిన్' దర్శకుడు మురళీ కిషోర్, ఎడిటర్ నవీన్ ఇద్దరూ పనిరాక్షసులు. భాగ్యశ్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రాన్ని అంగీకరించినందుకు ఆ అమ్మాయికి థాంక్స్ చెప్పాలి. సినిమా విడుదలకు ముందు రోజు రాత్రి భాగ్యశ్రీ ఫోన్ చేసి టెన్షన్ పడింది. తాను ఎంతో కష్టపడుతున్నాననీ కానీ, సరైన గుర్తింపు రావట్లేదని బాధపడింది. 'కష్టానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా వస్తుందని చెప్పా. అదే నిజమైంది. ఈ సినిమా విజయంలో నాగవంశీ ముఖ్యపాత్ర పోషించారని టీమ్‌కు థాంక్స్ చెప్పారు. ఇక అఖిల్ గురించి మాట్లాడుతూ.. ఏది అనుకున్నా దాన్ని కచ్చితంగా సాధించాలనే తపన చిన్నప్పటి నుంచి ఉంది. ఎంతో ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇప్పటి వరకూ ప్రతి సినిమాకు వందశాతం న్యాయం చేశాడు. కానీ, హిట్ కొట్టలేకపోయాడు. 'లెనిన'తో సరైన హిట్ పడింది. ఈ సినిమాకు ముందు ఒక ప్రమాదంలో అఖిల్ చేతికి దెబ్బతగిలింది. చాలా రోజులు చేయి పనిచేయలేదు. మళ్లీ మాములుగా వస్తుందా లేదా అని అందరం టెన్షన్ పడ్డాం. ఆ సమయంలో అఖిల్‌లో చాలా మార్పు వచ్చింది. దేని గురించైనా నిదానంగా ఆలోచించడం నేర్చుకున్నాడు. అదే సమయంలో పెళ్లి అయింది. వాడికంటూ ఓ తోడు వచ్చింది. గుడ్ టైం ప్రారంభమైందనిపించిందని చెప్పారు. అక్కినేని అభిమానులకు నాగార్జున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఓ సుకుమారి ట్రైలర్ విడుదల

'మసూద', 'పరేషాన' చిత్రాలతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్, టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ మ్యూజికల్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ, ఆ తర్వాత వారి జీవితాల్లో వచ్చే మలుపుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తిరువీర్ తన మార్క్ సహజ నటనతో ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ మరోసారి నటన ప్రాధాన్యమున్న పాత్రలో మెరిశారు. భరత్ మంచిరాజు అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సున్నితమైన భావోద్వేగాలు, చక్కటి వినోదంతో కూడిన ఈ చిత్రం జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.




This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072.** Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085